Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :224 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు శుక్రవారం 05 డిసెంబర్ 2025 పేజీలు :12 వెల రూ5 /-


# రైజింగ్ సమ్మిట్ పై ఆశలు

**హైదరాబాద్, డిసెంబర్ 4:** తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో కీలక ఆర్థిక కేంద్రంగా నిలబెట్టాలనే సుదూర లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు అంకురార్పణ చేస్తోంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నిర్వహించడానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ సమ్మిట్‌ను కేవలం పెట్టుబడుల సమావేశంగా కాకుండా, రాబోయే రెండు దశాబ్దాల తెలంగాణ ప్రగతి ఆవిష్కరణ వేదికగా చెప్పవచ్చు.

**విజన్ డాక్యుమెంట్**

తెలంగాణ రైజింగ్–2047తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ముఖ్య కేంద్ర బిందువు తెలంగాణ రైజింగ్ –2047 విజన్ డాక్యుమెంట్. 2047 నాటికి మన దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుంది. ఈ ఉత్సవాల నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని %వి3వి% ట్రిలియన్ డాలర్ల (%వి250వి% లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న రోడ్ మ్యాప్ తెలంగాణ రైజింగ్ –



2047 విజన్ డాక్యుమెంట్లో ఉంది. దీని ద్వారా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దీర్ఘకాలిక పునాదిని పటిష్టంగా వేయాలన్న యోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

1. ప్రపంచ పెట్టుబడుల ఆకర్షణ – ఉద్యోగ కల్పన

తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి, పెట్టుబడులు పెట్టేందుకు పురికొల్పడమే ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా, తయారీ, ఐటీ/టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, మరియు ఎలక్ట్రిక్ వాహనాలు వంటి రంగాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం ధ్యేయంగా పెట్టుబడుల ఆకర్షణ చేపట్టనున్నారు. దీని ప్రభావం విషయానికి వస్తే, దిగ్గజ కంపెనీలు, పారిశ్రామికవేత్తల పెట్టుబడుల ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వేగంగా వృద్ధి చేయడం ఒక అంశంగా చెప్పవచ్చు. ఇంకో అంశం ఏమిటంటే, తెలంగాణ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు సృష్టించడం, అందులోనూ అత్యున్నత వేతన ఉద్యోగావకాశాలు కల్పించడం. దీనివల్ల రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గిపోవడమే - మిగతా3లో




## కోకాపేటలో రికార్డుల మోతే..

**హైదరాబాద్, డిసెంబర్ 4:** కోకాపేట నియోపొలిస్‌లోని ప్రీమియం భూములకు మూడో విడత ఈ–వేలం ప్రక్రియ ముగిసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహించిన ఈ వేలంలో రెండు ప్లాట్లకు ఎకరానికి రూ.118 నుంచి 131 కోట్ల వరకు ధర పలికింది. మొత్తం 8.04 ఎకరాలకు రూ.1,000 కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం మూడు విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు - మిగతా3లో

## వివాదంలో పొంగులేటి కుమారుడు....



**హైదరాబాద్, డిసెంబర్ 4:** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు హర్షా రెడ్డి మీద వట్టినగులపల్లిలో భూమి ఆక్రమణ దౌర్జన్యంలో హత్యాయత్న కేసు నమోదు అయినా ఎఫ్ఐఆర్ మార్చేశారని భారత రాష్ట్ర సమితి నేతలు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో మంత్రి కుమారుడు 70 మంది బౌన్సర్లు బృందంతో మూడు ఎకరాల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న వారిపై దాడి చేసి, హద్దుల గోడలు కూల్చి వేశారు. పశువుల షెడ్‌ను - మిగతా3లో

## వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే పదవి ఖాయం

**హైదరాబాద్, డిసెంబర్ 4:** డీసీసీల నియామకం అయిపోయింది. పార్టీ పదవులు ఒక్కొక్కటిగా భర్తీ అయిపోతున్నాయ్. ఇక పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే మిగిలాయి. హెవీ కాంపిటీషన్ ఉండటంతో..వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాన్ని ఇన్నాళ్లు హోల్డ్ లో పెట్టారు. ఆల్ ఆఫ్ సడెన్ గా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన హింట్ తో రేసు మొదలైందట. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం లాబీయింగ్ స్టార్ట్ చేశారట లీడర్లు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేసులో ఉన్నదెవరు? ఛాన్స్ దక్కె నేతలెవరు?తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి పదవుల పందేరం మొదలైంది. వరుసగా ఒక్కొక్కటిగా పార్టీ పదవులను భర్తీ చేస్తూ వస్తోంది ఏఐసీసీ. ఈ మధ్య కాలంలో వైస్ ప్రెసిడెంట్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ, పొలిటికల్ అడ్వైజరీ కమిటీ, జనరల్ సెక్రటరీలు..లేటెస్ట్ గా డీసీసీ డీసీసీ ప్రెసిడెంట్లను నియమించారు. ఇక ఫైనల్ గా మిగిలింది ఒక్క వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు మాత్రమే. ఈ కీలకమైన పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉంది. కీలకమైన నేతల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో ఇన్నాళ్లు హోల్డ్



లో పెట్టారు. అయితే గాంధీభవన్ లో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ లో పీసీసీ చీఫ్ - మిగతా3లో



## చంపేస్తున్న చలి...

**అదిలాబాద్, డిసెంబర్ 4:** చలి తీవ్రత అధికం కావడంతో దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత ఊహించిన దాని కంటే అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు.తెలంగాణ, ఉత్తర కర్ణాటకతో పాటు మధ్య, వాయవ్య, పశ్చిమ, తూర్పు భారతంలోని పలు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనుంది. ఈ నెల నుంచి ఫిబ్రవరి వరకు ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయన్న వివరాలపై భారత వాతావరణ శాఖ ఐఎండీ ఓ రిపోర్టు రిలీజ్ చేసింది. ఆయా ప్రాంతాల్లో పగలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా రికార్డు అవుతాయని - మిగతా3లో

## దావోస్ బిజినెస్ ఫోరమ్ స్థాయిలో ఏర్పాట్లు...



**హైదరాబాద్, డిసెంబర్ 4:** వరల్డ్ ఫేమస్ స్పోర్ట్స్ స్టార్ మెస్సీ హైదరాబాద్ రాబోతున్నారు. ఆయనతో కలిసి ఫుట్‌బాల్ అడబోతున్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఆ క్రీడా వేదికపై కూడా తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రమోట్ చెయ్యబోతున్నారు. సో, గ్లోబల్ సమిట్ కోసం గ్లోబును చుట్టెయ్యాలన్నంత కమిట్‌మెంట్‌తో నడుస్తోంది రేవంత్ సర్కార్. అందుకే, దావోస్ బిజినెస్ ఫోరమ్‌కి ఏమాత్రం తీసిపోని రీతిలో వరల్డ్ క్లాస్ ఇంటర్నేషనల్ ఈవెంట్ రేంజ్‌లో ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.500 కంపెనీల నుంచి వెయ్యి మందికి పైగా గ్లోబల్ డెలిగేట్లు కొలువుదీరే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. ఇదొక్కటే ప్రస్తుతానికి రేవంత్ సర్కార్ ముందున్న మేజర్ టార్గెట్. ముచ్చర్లలోని భారత్ ఫ్యూచర్ సిటీలో మరో నాలుగైదు రోజుల్లో మొదలయ్యే గ్లోబల్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణ అంటే భవిష్యత్ భారతానికి గర్వకారణం అనేది గ్లోబల్ సమిట్ మెయిన్ థీమ్.కేంద్రం నుంచే కాదు, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా గ్లోబల్ సమిట్‌కు సహకారం ఆశిస్తోంది తెలంగాణ సర్కార్. డిసెంబర్ 4వ తేదీన మంత్రులు స్వయంగా వెళ్లి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్‌కి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్–హర్యానాకు దామోదర్ రాజనర్సింహ, కర్ణాటక–తమిళనాడుకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తర ప్రదేశ్‌కు పొంగులేటి, రాజస్థాన్‌కు పొన్నం ప్రభాకర్, చత్తీస్‌గడ్‌కు కొండా సురేఖ, పశ్చిమ బెంగాల్‌కి సీతక్క, మధ్యప్రదేశ్‌కి తుమ్మల నాగేశ్వరరావు, అస్సామ్‌కి జూపల్లి కృష్ణారావు, బీహార్‌కి వివేక్ వెంకటస్వామి, ఒడిషాకి వాకిటి శ్రీహరి, హిమాచల్ ప్రదేశ్‌కి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, మహారాష్ట్రకు మొహమ్మద్ అజారుద్దీన్.. - మిగతా3లో

## సెంటిమెంట్ రగిల్చి లబ్ధిపొందే యత్నం..

# బీఆర్ఎస్‌పై పీసీసీ చీఫ్ ఫైర్

**హైదరాబాద్, డిసెంబర్ 4:** మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్ఎస్ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు.హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని వెల్లడించారు మహేష్ గౌడ్. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు



పడ్డ కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు.కాగా.. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.

## అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ: కేటీఆర్

**హైదరాబాద్:** హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని - మిగతా3లో



వార్తాతరంగాలు



## సంపాదకీయం

# కన్నడలో కుర్చీలాట

కర్ణాటక రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మొన్నటిదా కా అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని అటు సీఎం సిద్ధరామయ్య.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గంభీరంగా పేర్కొన్నప్పటికీ లోలోపల మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. హైకమాండ్ మాటకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్న డీకే శివ కుమార్ తాజాగా తన 'ఎక్స్' ఖాతాలో 'ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడ మే ప్రపంచంలో పెద్ద శక్తి' అని ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా సిద్ధరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారుఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది. 2023లో కర్ణాటకకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీకి మించి 23 సీట్లు అధికంగా సాధించి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి సిద్ధరామయ్యతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడైన డీకే శివకుమార్ శక్తికి మించి పనిచేశారు. దీంతో ఐదేళ్ల పాలనలో రెండున్నరేళ్లు పూర్తి కాగానే అధికార మార్పిడి జరగాలని ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు సిద్ధరామయ్య ఈ ఏడాది నవంబర్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆ తర్వాత సీఎం పగ్గాలను డీకేకు అప్పగించాలికానీ సిద్ధరామయ్య పార్టీ కేంద్ర నాయకత్వంతో భేటీ అయ్యి ఐదేళ్లు తానే సీఎంగా ఉండేలా అనుమతులు తెచ్చుకోవడంలో తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇదే సమయంలో డిప్యూ టీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ కూడా సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్ధంగా లేరనిపించింది. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో డీకే పాత్ర మరువలేనిది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అన్ని వర్గాలను కలుపుకుని పోయి సమన్వయంతో వ్యవహరించి పార్టీని విజయపథంలో నడిపించారు. అయితే అపార పరిపాలన అనుభవం కలిగిన సిద్ధరామయ్యకే సీఎం పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం మొగ్గుచూపింది.హైకమాండ్ ఆదేశాలను తాను శిరసావహిస్తానని డీకే చెప్పడంతో సమస్య చల్లబడినట్లుగా అనిపించింది. ఈ నవంబర్ 20తో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి కావడంతో అధికార మార్పిడి అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. శివకుమార్‌ను పొలిటికల్ మాస్టర్ మైండ్‌గా అభివర్ణించినప్పటికీ.. పాలన విషయంలో సిద్ధరామయ్య ఒక మెట్టు ముందు ఉంటారు. జనతాదళ్ నుంచి బహిష్కరణకు గురై 2006లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సిద్ధరామయ్య పార్టీలో అగ్రస్థానానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య , డీకే శివకుమార్ మధ్య పోరు కొనసాగుతుండగా ఉప ముఖ్యమంత్రికి పదోన్నతి కల్పించాలని కోరేందుకు ఆయన మద్దతుదారులు ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కాగా పార్టీ అధిష్టానం నిర్ణయిస్తే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య సోమవారం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన కొందరు ఎమ్మెల్యేలకు అదనంగా డీకే శిబిరానికి చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ చేరుకోగా మరికొందరు కూడా హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని తనతోపాటు డిప్యూటీ సీఎం కూడా అంగీకరించక తప్పదని సిద్ధరామయ్య విలేకరులకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం.నవంబర్ 20వ తేదీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. మరోవైపు తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానంటూ మాజీ కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వర ప్రకటించడం కలకలం రేపుతోంది.ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాటలు తనకు వేద వాక్యం లాంటివని శివకుమార్ సోమవారం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని, అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరులు ప్రశ్నించినపుడు తాను కూడా ముఖ్యమంత్రి ప్రకటనతో ఏకీభవిస్తున్నానని డీకే చెప్పారు.2013లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంతో పాటు సీఎంగా ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపించారు. ఇటు సిద్ధూ.. అటు డీకేల్లో ఉన్న ప్రత్యేక లక్షణాలే ఇవాళ హైకమాండ్‌కు సీఎం మార్పు తలనొప్పిగా మారిపోయింది. 2006లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.పాలనా ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్లు పూర్తయిన తర్వాత జేడీఎస్ అధినేత కుమారస్వామి అయిష్టంగానే సీఎం పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు బీఎస్ యడ్యూరప్పకు అప్పగించారు. ప్రస్తుతానికి సీఎం సిద్ధరామయ్య పదవికి ఎలాంటి ముప్పు లేదని తెలుస్తోంది. కర్ణాటక రాష్టంలో ఓబీసీలదే రాజ్యమని కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలుసని నివేదికలు చెబుతున్నాయి ఆయనకు అహింద వర్గంతో పాటు పార్టీలోని 100 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కాంగ్రెస్ పార్టీకి సభలో మొత్తం 137 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య అంగీకారం లేకుండా ముఖ్యమంత్రిని మార్చడం అనేది చాలా కష్టం.కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల సమాఖ్య కాంగ్రెస్‌ను హెచ్చరించింది. రాష్ట్ర యూనిట్‌లో అంతర్గత కలహాల నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించడానికి ఏ ప్రయత్నం చేసినా అది పార్టీపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. మరోవైపు కర్ణాటక రాష్ట్ర వొక్కలిగ సంఘం కూడా ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్న ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు అన్యాయం జరిగితే.. వారు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించింది.ముఖ్యమంత్రిని మార్చాలని సిద్ధరామయ్య వర్గంపై ఒత్తిడి తెస్తే వారు అధిష్ఠానానికి పేర్ల జాబితాను సమర్పిస్తారని గత కొద్ది రోజులుగా మీడియా నివేదికలలో వెల్లడైంది. ఇందులో ఓ ప్రత్యామ్నాయంగా హోంమంత్రి జి.పరమేశ్వర్ పేరు ఉండవచ్చు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. సిద్ధరామయ్య వర్గం ఏ పరిస్థితులలోనూ డీకే శివకుమార్‌ను తమ బాస్‌గా అంగీకరించడానికి సిద్ధంగా లేదు.అయితే కొన్ని రోజులకే జేడీఎస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు రావడంతో ప్రభుత్వం కుప్పకూలింది. తాజా పరిస్థితుల్లో కాం గ్రెస్‌లో అలాంటి అవకాశం లేనప్పటికీ హైకమాండ్ సీఎం మార్పుపై ఆచితూచి అడుగులు వేయాల్సిన అవసరముంది.

# నేడు నెల్సన్ మండేలా వర్ధంతి

### జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు, నల్లజాతి సూరీడు, భారతరత్న నెల్సన్ మండేలా

జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో జరిగిన ఒక మారణకాండకు సంబంధించి 27 సంవత్సరాలపాటు "రోబెన్" అనే ద్వీపంలో జైలు శిక్షను అనుభవించిన మండేలా, 20వ శతాబ్దపు అత్యంత సుప్రసిద్ధులైన ప్రపంచ నాయకులలో ఒకరిగా గుర్తింపు పొందారు. దీంతో ఆయన, జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిపే పోరాటాలకు, వర్ణ సమానతకు ఒక సంకేతంలాగా నిలిచారు. జీవిత వివరాలను చూస్తే... నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా, దక్షిణాఫ్రికా దేశ మాజీ అధ్యక్షుడు. కేప్ ప్రాంతంలోని ఉమటా జిల్లా, మవెజో అనే ఊర్లో 1918, జూలై 18వ తేదీన ఈయన జన్మించారు. దక్షిణాఫ్రికాకు పూర్తి స్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడిగా ఈయన కీర్తి గడించారు. అధ్యక్షుడు కాకమునుపు ఇతను జాతి వివక్ష వ్యతిరేఖ ఉద్యమకారుడిగా, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు, దానికి సాయుధ విభాగం అయిన "ఉంకోంటో విసిజ్వే"కు అధ్యక్షుడిగా పనిజేశారు.ఫిబ్రవరి 11, 1990లో జైలునుండి విడుదల అయిన తరువాత నెల్సన్ మండేలా రాజకీయంగా తన లక్ష్యాన్ని సాధించడానికి, దేశంలో నెలకొన్న జాతి వైర్యాన్ని నివారించడానికి, అందరి మధ్య సయోధ్య పెంచడానికి కృషి చేశారు. తన పూర్వపు శత్రువులనుండి కూడా ప్రశంసలు అందుకొన్నారు. వందకు పైగా అవార్డులు, సత్కారాలతో వివిధ దేశాలు, సంస్థలు ఈయనను గౌరవించాయి. వాటిలో 1993లో లభించిన నోబెల్ శాంతి బహుమతి ముఖ్యమైనది. స్వదేశంలో మండేలాను "మదిబా" అని వారి తెగకు సంబంధించిన



గౌరవసూచకంతో పిలుస్తుంటారు.జాతిపిత మహాత్మా గాంధీ బోధించిన శాంతియుత విధానాలు, అహింస, శత్రువును సంస్కారయుతంగా ఎదుర్కొనే పద్ధతి తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని మండేలా చాలాసార్లు వెల్లడించారు. భారత దేశం కూడా మండేలాను "జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ సయోధ్య బహుమతి"తో సత్కరించింది.అలాగే... 1990లో భారత ప్రభుత్వం మండేలాకు మనదేశపు అత్యున్నత పురస్కారం అయిన భారతరత్నను ప్రకటించింది. మన దేశం నుంచి ఆయనకు ఎంతో గౌరవం లభించిందన్న దానికి నిదర్శనంగా అనేక విగ్రహాలు కూడా చాలాచోట్ల నెలకొల్పబడ్డాయి. కొన్ని కూడళ్ళకు, రోడ్లకు మండేలా పేరు పెట్టారు. ఢిల్లీలో కూడా ఆయన పేరుతో ఒక "నెల్సన్ మండేలా రోడ్" ఉంది.అదలా ఉంచితే... 1994లో మండేలా తన 77 సంవత్సరాల వయసులో అధ్యక్ష పదవిని చేబట్టి ఆ పదవిని అలంకరించిన వారిలో అతి పెద్ద వయస్కుడయ్యారు. రెండవసారి మరలా ఎన్నికల్లో పోటీ చేయరాదని నిశ్చయించుకున్న ఆయన, 1999లో పదవీ విరమణ చేశారు. జూలై 2001లో ఆయనకు ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, రేడియేషన్ వైద్యం చేశారు.తన పదవీ విరమణ తరువాత ఎయిడ్స్ వ్యాధి నివారణకు మండేలా విశేషంగా కృషి చేశారు. ఆ తరువాత జూన్ 2004లో తాను రాజకీయ జీవితం నుండి విరమించుకుని, అధికంగా కుటుంబంతో గడపాలని అనుకుంటున్నట్లు మండేలా ప్రకటించారు. అయితే ఆయన పూర్తిగా సమాజం నుంచి దూరం కాలేదుగానీ, 2003 తరువాత తన సాంఘిక కార్యక్రమాలను బాగా తగ్గించుకున్నారంతే..!కొంత కాలంగా తీవ్ర శ్వాసకోశ సంబంధ అస్వస్థతతో బాధపడుతూ 2013 డిసెంబర్ 5 న 20:50 (దక్షిణాఫ్రికా ప్రాంతీయ సమయం) కగంటలకు జోహెన్స్ బర్గ్ లో మరణించారు. వివిధ దేశాలనుండి సుమారుగా 90 మంది ప్రతినిధులు ఆయన అంత్యక్రియలకు హాజరు అయ్యారు.

# ఫోర్ ఆర్ లు...

**న్యూఢిల్లీ డిసెంబర్ 4:**కేంద్ర ప్రభుత్వం కొత్త స్లోగన్ తీసుకొస్తోంది. అదే ఆర్‌ఆర్‌ఆర్‌ఆర్. సుజలాం భారత్ 2025లో భాగంగా.. ఈ ప్లాన్ చేసింది. జల్ జీవన్ మిషన్ లో ఈ 4ఆర్ లు ఉంటాయి. అందులో మొదటి ఆర్. అంటే రెడ్యూస్ (నీటి వినియోగం తగ్గించడం), రెండోఆర్. అంటే రీయూజ్, మూడో ఆర్. అంటే రీచార్జ్ (నీటి వనరుల లభ్యత పెంచుకోవడం, భూగర్భ జలాలు పెంచడం), ఇక నాలుగో ఆర్. అంటే రీసైకిల్ (నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించడం). జల శక్తి ఆధ్వర్యంలో, నీతి ఆయోగ్ సహకారంతో ఈ ప్లాన్ చేస్తోంది.దేశంలో పట్టణీకరణ విపరీతంగా పెరుగుతోంది. ఉద్యోగ, ఉపాధి, విద్య, ఇతర అవకాశాల కోసం జనం సిటీల బాట పడుతున్నారు. అయితే, దీనికి తగినట్టు వాటర్ అందుబాటులో లేదు. అందుకే మహా నగరాల్లో నీటి కటకట ఏర్పడుతూ ఉంటుంది. పెరుగుతున్న పట్టణీకరణకు సరిపడా నీటిని అందుబాటులో ఉంచడానికి ఏం చేయాలనే దానిపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో కొత్త స్లోగన్ తీసుకొచ్చింది.సుజలాం భారత్ విజన్ కింద కొన్ని కొత్త కార్యక్రమాలు చేపట్టనుంది. దేశంలోని రాష్ట్రాలు, కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనుంది. ఈ ప్రాజెక్టులో నదులను పునరుజ్జీవం చేయడం, వాటర్ మేనేజ్ మెంట్, టెక్నాలజీ ఆధారంగా నీటి వినియోగం, భూగర్భ జలాలు పెంచడం, సురక్షిత మంచినీటి సరఫరా లాంటివి ఏర్పాటు చేయడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది.సరైన తాగు నీరు లేకపోవడం వల్ల దేశంలో కొన్ని కోట్ల మంది ప్రజలు తమ దైనందిన జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. సరైన నీటి లభ్యత లేకపోవడం వల్ల శానిటేషన్ సమస్య ఏర్పడుతోంది. అనారోగ్యాల పాలవుతున్నారు. న్యూట్రిషన్ కూడా అందడం లేదు. ఇలాంటి సమస్యలు అన్నిటికీ పరిష్కారం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.నదుల పునరుజ్జీవం కోసం నమామి గంగే లాంటి ప్రాజెక్టులు ఇంకా చేపట్టడానికి అవకాశం ఉంది. దేశంలో ఉన్న ఇతర నదుల విషయంలో కూడా ఇలాంటి నినాదంతో ముందుకెళ్లనుంది. ఇప్పటివరకు సుమారు 15 కోట్ల మందికి జల్ జీవన్ మిషన్ ద్వారా ట్యాప్ వాటర్ అందించినట్టు చెబుతున్న ప్రభుత్వం 2028 నాటికి దేశంలోని ప్రతి ఇంటికి ట్యాప్ వాటర్ అందించాలనే టార్గెట్ చేసింది. ప్రతి ఇంట్లో ప్రతి మనిషికి రోజుకు కనీసం 55 లీటర్ల నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే భూగర్భ జలాలను పెంచే క్రమంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ మీద ఫోకస్ చేయనుంది.

# సంస్కరణలా? కార్మికుల హక్కులను కత్తిరించడమా?

ప్రతి ఒక్కరూ జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని అనుకుంటారు. కానీ అందరూ అనుకున్న గమ్యాన్ని చేరుకోలేరు. అయితే ఆర్థిక అవసరాలు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఒక్కోసారి చిన్న ఉద్యోగం అయినా చేయాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో ఎక్కడైనా ఉద్యోగ అవసరం ఉంటే వెంటనే అక్కడికి వెళ్లి జాబ్ కోసం అడుగుతూ ఉంటారు. అయితే మొన్నటి వరకు చిన్న ఉద్యోగం చేసే వారికి ఎలాంటి ప్రయోజనాలు లేవు. కానీ కొత్తగా లేబర్ కోడ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత వీరికి అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయి. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ముసాయిదా నిబంధనలు త్వరలోనే ప్రీ-పబ్లిష్ అవుతాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ బుధవారం చెప్పారు. వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయడం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభమవుతుందన్నారు.ఒక షాప్ లేదా చిన్న సంస్థలో ఉద్యోగం అంటే కేవలం పనికి తగిన జీతం ఇచ్చేవారు. ఎలాంటి ప్రయోజనాలు ఉండేవి కావు. కనీసం వారు ఉద్యోగం చేస్తున్నట్లు ఎలాంటి గుర్తింపు లేదా ఐడెంటిటీ ఉండేది కాదు. కానీ కొత్తగా వచ్చిన లేబర్ కోడ్ ప్రకారం ఏ సంస్థ అయినా ఉద్యోగిని నియమించుకుంటే ఖచ్చితంగా అపాయింట్మెంట్ లెటర్ ఇవ్వాల్సిందే. అపాయింట్మెంట్ లెటర్ లేకుండా ఎవరినీ నియమించుకోవడానికి ఆస్కారం లేదు. ఈ అపాయింట్మెంట్ లెటర్ ద్వారా ఉద్యోగికి గుర్తింపు ఉండడంతో పాటు ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్ లా ఉపయోగపడుతుంది. అతను ఇక్కడ ఎన్నాళ్లపాటు చేశాడో.. దాని ఆధారంగా మరో ఉద్యోగాన్ని కూడా పొందే అవకాశం ఉంటుంది.అంతేకాకుండా అపాయింట్మెంట్ లెటర్లో ఉద్యోగికి సంబంధించిన ప్రయోజనాలు ఉంటాయి. 20 మంది ఉద్యోగులు ఉన్న చిన్న సంస్థలో ఇప్పటివరకు ఈపీఎఫ్ ఏర్పాటు చేసేవారు. కానీ ఇప్పుడు ప్రతి ఉద్యోగికి ఈపీఎఫ్ ఉండాల్సిందేనని కొత్త లేబర్ కోడ్ తెలుపుతోంది. అలాగే ఆర్గనైజ్డ్, అన్ ఆర్గనైసేడ్ సంస్థల్లో ఉన్న ఉద్యోగికి కనీస వేతనం ఇవ్వాలని తెలిపింది. గతంలో వారు నిర్ణయించుకున్న జీతం మాత్రమే ఇచ్చేవారు. కానీ ఇప్పుడు లేబర్ కోడ్ యాక్ట్ ప్రకారం గా జీతం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ జీవితంలో ఎక్కువ భాగం పిఎఫ్, గ్రాట్యుటీ కి వెళ్తుంది. దీర్ఘకాలంలో ఇది ఉద్యోగులకు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది.మొన్నటివరకు గిగ్ వర్కర్లు, ఫ్రీలాన్స్ సర్వీస్ చేసే వారికి ఎలాంటి ప్రయోజనాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు వీరికి సైతం సామాజిక భద్రతను కలిగిస్తున్నాయి. వీరికి లైఫ్ ఇన్సూరెన్స్, డిజేబులిటీ కవర్, హెల్త్ సపోర్ట్ వంటి ప్రయోజనాలు ఉండనున్నాయి. గతంలో గ్రాట్యుటీ రావాలంటే కనీసం ఐదు సంవత్సరాల పాటు ఒక సంస్థలో పనిచేయాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఒక ఏడాది పని చేసినా కూడా గ్రాట్యూటీ లభిస్తుంది. ఇది ఉద్యోగి సంస్థ నుంచి వెళ్ళిపోయే సమయంలో ఆర్థిక అవసరాలను తీరుస్తుంది. అలాగే ఓవర్ టైం పనిచేసే వారికి అదనంగా ఆదాయం ఇవ్వాలని కూడా కొత్త లేబర్ కోడ్ తెలుపుతోంది. ఈ రకంగా అదనంగా పనిచేసిన వారి కి ప్రయోజనాలు కలగనున్నాయి.దశాబ్దాలుగా అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా దేశంలో అత్యంత ప్రభావవంతమైన ఆర్థిక సంస్కరణలను అమలు చేయనున్నట్లు భారత ప్రభుత్వం గతవారం ప్రకటించింది.దీని కారణంగా, కార్మిక నిబంధనల సంఖ్య 1,400 నుంచి దాదాపు 350కి తగ్గింది. కంపెనీలు పూరించాల్సిన ఫారమ్‌ల సంఖ్య 180 నుంచి 73కి తగ్గింది. దీంతో, వాణిజ్య నియంత్రణ భారం చాలావరకు తగ్గుతుంది.ఈ చట్టాలను 2020లోనే పార్లమెంట్ ఆమోదించింది. కానీ, ఐదేళ్ల జాప్యం, రాజకీయ చర్చల తర్వాత, ఇప్పుడు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.పాత కార్మిక నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయని, తయారీ రంగ మందగమనానికి అవే కారణమని నిందించిన కంపెనీలు.. ఈ సంస్కరణలను స్వాగతించాయి. ముఖ్యంగా ట్రంప్ 50 శాతం సుంకాల నేపథ్యంలో ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాలనే ప్రభుత్వ ధోరణిలో ఇది భాగం. దేశంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి, మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి, జీవీసీ (గ్లోబల్ వాల్యూ చైన్)లో విలీనం కావడానికి భారత్ ఆసక్తిగా ఉందనేదానికి ఇదో ముఖ్యమైన సంకేతమని బ్రోకింగ్ హౌస్ నోమురా అభిప్రాయపడింది.మరోవైపు, కార్మిక సంఘాలు వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ కోడ్‌లను "స్వాతంత్ర్యం తర్వాత కార్మికులు కష్టపడి సాధించుకున్న హక్కులను కాలరాసే దుందుడుకు చర్య"గా అభివర్ణిస్తున్నాయి.కార్మిక చట్టాలలో మార్పులు దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీశాయి. బుధవారం దిల్లీలో వామపక్ష ట్రేడ్ యూనియన్ల నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలో సుమారు 200%-%300 మంది పాల్గొన్నారు. కొత్త చట్టాలు కార్మికులకు కాదు, యజమానులకే ఉపయోగకరమని 33 ఏళ్ల ఫ్యాక్టరీ కార్మికుడు ఆకాశ్‌దీప్ సింగ్ అన్నారు.నిరసనలో పాల్గొన్న చాలామంది ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలు.. కాలం చెల్లిన కార్మిక చట్టాల ఆధునీకరణకు, నిబంధనల అమలును సరళతరం చేసేందుకు, కార్మికుల హక్కుల సంరక్షణకు ఉద్దేశించినవని ప్రభుత్వం చెబుతోంది. కొత్త చట్టాలు దేశంలో పెరుగుతున్న గిగ్ వర్క్‌ఫోర్స్‌కు మొదటిసారిగా చట్టపరమైన గుర్తింపును ఇస్తాయని అంటోంది.కార్మికులకు అనుకూలమైన పలు అంశాలు: కంపెనీలు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వడం, అందరికీ ఒకేరకమైన కనీస వేతనాలు, 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షలు, లింగ భేదం లేకుండా వేతనం వంటివి స్వాగతించదగినవి.నిబంధనల అమలు భారం తగ్గడం, మెరుగైన సామాజిక భద్రత, గిగ్ వర్కర్లనూ చేరుస్తూ "ఉద్యోగి" నిర్వచనాన్ని విస్తరించడం వంటి సంస్కరణలు దేశంలో విస్తృతమైన అసంఘటిత ఆర్థిక వ్యవస్థను సంఘటిత వ్యవస్థలోకి తెచ్చేందుకు సాయపడతాయని నిపుణులు అంటున్నారు.కొత్త కోడ్‌లు పాత చట్టాలలోని అనేక అసమానతలను పరిష్కరిస్తాయని నీతి ఆయోగ్ మాజీ చైర్మన్, ఆర్థికవేత్త అరవింద్ పనగారియా అభిప్రాయపడ్డారు."భారత కార్మిక చట్టాలను 100 శాతం అమలు చేయలేరు, వాటిలో 20 శాతం ఉల్లంఘించక తప్పని పరిస్థితులు ఉన్నాయన్నారు.కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులు ఇప్పటికే లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయని, చాలామంది కార్మికులు తమ ఫిర్యాదులను నమోదు కూడా చేసుకోలేకపోతున్నారని ఆయన అన్నారు.కార్మికులు ఇప్పుడు సమ్మెకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి - ఈ నిబంధన గతంలో ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రమే వర్తించేది. ఇది సమష్టిగా బేరసారాలు చేసే కార్మికుల అధికారాన్ని దూరం చేస్తుందని దత్తా అభిప్రాయపడ్డారు.దేశంలోని శ్రామిక-వయస్సు జనాభాలో సగానికి పైగా శ్రామిక శక్తిలో లేరు. దాదాపు 60 శాతం మంది కార్మికులు స్వయం ఉపాధి పొందుతున్నారు. పాత చట్టాలు విఫలమయ్యాయనే విషయాన్ని ఇది స్పష్టంగా చూపుతోందని నిపుణులు అంటున్నారు.తయారీ, పెట్టుబడిపై కొత్త నిబంధనల ప్రభావం ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. కానీ స్వల్పకాలంలో, కంపెనీలు అనేక సవాళ్లను ఎదుర్కోవచ్చు."వేతనాలు, హెచ్‌ఆర్ వ్యవస్థ, సామాజిక భద్రత, నిబంధనలు అమలు వంటి విషయాల్లో సంస్థలు మార్పులకు సిద్ధం కావాలి" అని స్టాఫింగ్ ఏజెన్సీ బీడీఓ ఇండియా తెలిపింది.కార్మిక వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర చట్టాలు రెండూ నియంత్రిస్తుండటంతో, కంపెనీలు కొంతకాలం రెండు సెట్ల నియమాలను పాటించాల్సి రావొచ్చని బీడీఓ ఇండియా అభిప్రాయపడింది.యూనియన్ల నుంచి కొనసాగుతున్న నిరసనలను కూడా ప్రభుత్వం ఎదుర్కోవలసి ఉంటుందని అంచనా వేసింది.

# రైజింగ్ సమ్మిట్ పై ఆశలు

- మొదటి పేజీ తరువాయి

కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

2. తెలంగాణకు గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ – నమ్మకమైన గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రం

ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – 2025 ద్వారా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచడం తెలంగాణ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన, నమ్మకమైన పెట్టుబడి గమ్యస్థానంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. భారతదేశంలోనే 'వ్యాపారం చేయడానికి సులభంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచే పలు సంస్కరణలను ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి మెరుగైన బ్రాండింగ్, స్థిరమైన ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రవహించడానికి మార్గం సుగమం అవుతుంది.

3. తెలంగాణ విజన్ 2047 ఆవిష్కరణ – ఆర్థిక స్వావలంబన భారతదేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా %వి3వి% ట్రిలియన్



డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చేందుకు సమగ్ర ఆర్థిక, సామాజిక, మౌలిక సదుపాయాల రోడ్ మ్యాప్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ సమ్మిట్‌కు వచ్చే ప్రపంచ నేతలు, ఆర్థికవేత్తలు, అంతర్జాతీయ మీడియా ముందు తెలంగాణ విజన్ –2047ను ఆవిష్కరించడం ద్వారా కలిగే ప్రభావం విషయానికి వస్తే, అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో విశ్వాసం కలుగుతుంది. ఇది కేవలం ఒక రాష్ట్ర ఆకాంక్షగా కాకుండా, అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ ప్రణాళిక రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉందన్న సంకేతం వెళుతుంది. దీనివల్ల పెట్టుబడిదారులు నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు కుమ్మరిస్తారన్నది ప్రభుత్వ యోచన.

4. సమ్మిళిత, సమతుల్య వృద్ధి – అన్ని ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక

ఈ గ్లోబల్ సమ్మిట్‌లో కేవలం హైదరాబాద్‌ను మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో కూడా ఐటీ, పరిశ్రమలు నెలకొల్పేలా చేయడం. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల వృద్ధిపై అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం ప్రదర్శించనుంది. దీని ద్వారా ఆర్థిక ఫలాలు కేవలం హైదరాబాద్ వంటి నగరానికి మాత్రమే కాకుండా, అన్ని ప్రాంతాలకు సమంగా అందించాలన్న ఉద్దేశాన్ని ప్రకటించడం. దీనివల్ల ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల్లో నమ్మకాన్ని నెలకొల్పడం ద్వారా నగరాలకు, పట్టణాలకు వలసలను నివారించే ప్రయత్నంగా చెప్పవచ్చు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 అనేది రాష్ట్ర భవిష్యత్తుకు టార్చ్ బేరర్ వంటిదని ప్రభుత్వం భావిస్తోంది. ఇది పెట్టుబడులను, ఉద్యోగాలను ఆకర్షించడమే కాక, రాష్ట్రాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రధాన శక్తిగా నిలబెట్టడానికి వేస్తున్న పటిష్టమైన తొలి అడుగుగా అభివర్ణిస్తోంది.

# వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే పదవి ఖాయం

- మొదటి పేజీ తరువాయి

మహేష్ కుమార్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేస్తామని చెప్పారు. దీంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం నేతలు మరోసారి లాబీయింగ్ స్టార్ట్ చేశారట.కాంగ్రెస్ పార్టీలో పీసీసీ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు అత్యంత కీలకమైనది. ఈ పోస్టులో గతంలో పని చేసిన వారందరూ ఇప్పుడు కీలకమైన పోస్టులో ఉన్నారు. ప్రస్తుతం సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి కూడా కాంగ్రెస్ లోకి రాగానే వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేసిన వారే. ప్రస్తుతం పీసీసీ చీఫ్ గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ కూడా లాస్ట్ టర్మ్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేశారు. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కీలకమైన నేతలే పని చేయడంతో ఇప్పుడు ఈ పోస్ట్ కు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఈ సారి వర్కింగ్ ప్రెసిడెంట్లను సామాజిక వర్గాల వారీగా కీలకమైన వ్యక్తులకు ఛాన్స్ ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోంది.వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం సామాజికవర్గాల వారీగా ఈసారి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోందట. ఒక్కో సామాజిక వర్గం నుంచి ఒక్కరికి ఛాన్స్ ఉండటంతో..పోటీలో మాత్రం చాలా మంది క్యూలో ఉన్నారట. రెడ్డి సామాజికవర్గం నుంచి పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితులు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రోహిన్ రెడ్డితో పాటు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా రేసులో ఉన్నారట.నాయిని రాజేందర్ రెడ్డికి వైస్ ప్రెసిడెంట్ గా అవకాశం ఇచ్చినా..ఆయన ఆ పోస్టును తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఇక ఎంపీ చామల అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఫైనల్ గా రోహిన్ రెడ్డికి అవకాశం ఇస్తారని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక బీసీ సామాజికవర్గం నుంచి టీఎస్ఎండీసీ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ కోసం ప్రయత్నిస్తున్నారట.ఎస్సీ సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ లాబీయింగ్ చేస్తున్నారట. ఎస్టీ



సామాజికవర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్ రేసులో ఉన్నారని అంటున్నారు. ఎంపీ బలరాం నాయక్ పీసీసీ చీఫ్ పోస్ట్ కోసం ప్రయత్నాలు చేసినా..వర్క్ ఔట్ కాలేదని..దాంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట. ఇక ఫైనల్ గా మైనారిటీ కోటాలో ఫిరోజ్ ఖాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఖమ్మం మాజీ డీసీసీ అధ్యక్షుడు జావిద్ రేసులో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ కీలకమైన పోస్టు ఎవరెవరికి దక్కుతుందనేది చూడాలి.

## అనుముల రేవంత్ రెడ్డి కాదు..

# అవినీతి అనకొండ: కేటీఆర్

- మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

# వైట్ టెర్రర్ షురూ...

**హైదరాబాద్, డిసెంబర్ 4:** ఢిల్లీలో ఇటీవల జరిగిన పేలుడు ఘటన తర్వాత భారత్ మరింత అప్రమత్తమైంది. ఈ పేలుడుతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కానీ, మన నిఘావర్గాలు అప్రమత్తం కావడంతో భారీ ముప్పు తప్పడంతోపాటు పెద్ద ఉగ్ర లింకులు బయటపడ్డాయి. ఈ ఘటన తర్వాత మన పోలీసులు, భద్రతా బలగాలు, ఇంటలిజెన్స్ సంస్థలు ఉగ్ర లింకులను కట్‌చేసే పనిలో పడ్డాయి. తాజాగా జమ్మూ కశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో ఉగ్రవాద కమాండ్లతో అనుబంధం ఉన్న డాక్టర్లను గుర్తించడానికి సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ అధికారులు కొత్తగా అన్వేషణలు చేస్తున్నారు. ముఖ్యంగా ఫరీదాబాద్ అల్‌ఫలా యూనివర్సిటీ డాక్టర్లను లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇటీవల అక్కడ 2,900 కిలోల అమ్మోనియం నైట్రేట్ పట్టుబడింది. వీరికి ప్రతిష్ఠాత్మక ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.ఒమర్ ఉన్ నబీ అనే వ్యక్తి అమ్మోనియం నైట్రేట్ కొంత మోతాదు తీసుకెళ్లి ఢిల్లీలో పేలుడు చర్య చేశాడు. అల్‌ఫలా యూనివర్సిటీలో ఉపాధ్యాయులు షాహిన్, అదిల్, ముజామిల్ నబీ వంటి డాక్టర్లు జైష్%–%ఎ%–%మహ్మద్‌తో అనుబంధం ఉన్నట్టు గుర్తించబడ్డారు. ఈ డాక్టర్లు మెడికల్



కాలేజీల్లో పనిచేస్తూ ఉగ్ర కార్యకలాపాలకు సహకరించారు.కశ్మీర్‌కు చెందిన విభిన్న వ్యక్తులు దుబాయ్ ద్వారా పాక్ వెళ్లి ఎంబిబిఎస్ పూర్తి చేసి, తిరిగి భారత శాఖలలో నెలకొన్న ప్రైవేట్ ఉపాధి అవకాశాల్లో చేరుతున్నారు. పాక్ ఎంబీబిఎస్ కోర్సులకు గుర్తింపు ఇవ్వకపోతే కూడా, ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. ఢిల్లీలో 50 మంది పాక్ ఎంబీబిఎస్ డాక్టర్లు ఉన్నట్లు ప్రచారం.భారత ప్రభుత్వం ఉగ్రవాద రహిత పరిసరాల కోసం పాక్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన డాక్టర్లపై దృష్టి పెట్టింది. అల్ ఫలాహ్ యూనివర్సిటీపై విచారణలు కొనసాగుతున్న విషయం, అంతర్జాతీయ భద్రతా సాంఘిక వ్యవస్థలలో ప్రముఖంగా నిలబడింది. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశంగా మారింది.ఈ పరిణామాలు భారతీయ భద్రతా వ్యవస్థపై తీవ్రమైన సవాళ్లను తిరిగి ఉంచుతున్నాయి. ఉగ్రవాద సంఘటనలు, పైగా విద్యా సంస్థలలో నుంచి ఉగ్రవాదం పెరిగిపోవడం జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి

## కోకాపేటలో రికార్డుల మోతే..

- మొదటి పేజీ తరువాయి




రూ.3,708 కోట్లు లభించింది. నాలుగో విడత శుక్రవారం వేలం జరగనుంది. మొత్తంగా ఐదు వేలకోట్లను ప్రభుత్వం ఆశిస్తోంది. కోకాపేటలో హెచ్ఎండీఏ మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో వేలం వేస్తోంది. మొత్తం ఆరు ప్లాట్లు 27 ఎకరాలు వేలం అయ్యాయి. మొత్తం ఆదాయం రూ.3,708 కోట్లు వచ్చింది. ఇది హైదరాబాద్ చుట్టూ భూమి అభివృద్ధి, రోడ్లు, పార్కులు వంటి ప్రాజెక్టులను చేపడతారు. కోకాపేట నియోపొలిస్ లేఅవుట్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల వేలాలు భారీగా నిధులు కురిపిస్తున్నాయి. 2021 జూన్‌లో మొదటి విడతలో 8 ప్లాట్లు సుమారు 50 ఎకరాలు కు రూ.2,000 కోట్లు, 2023 ఆగస్టులో రెండో విడతలో 7 ప్లాట్లు 45.33 ఎకరాలు కు రూ.3,300 కోట్లు సమకూరాయి. మొత్తం 95 ఎకరాలకు ఎకరానికి రూ.40 నుంచి 100.75 కోట్ల వరకు ధరలు పలికి, హెచ్ఎండీఏకు రూ.5,300 కోట్లు ఆదాయం వచ్చింది. హెచ్ఎండీఏ 2021 జూన్ 10న మొదటి విడత ఈ-వేలాన్ని %మీుజ% పోర్టల్ ద్వారా నిర్వహించింది. కోకాపేట్‌లోని నియోపొలిస్ లేఅవుట్‌లో 8 ప్లాట్లు వేలం శారు. అప్పట్లో అప్‌సెట్ ప్రైస్ ఎకరానికి రూ.25 కోట్లు పెట్టారు. బిడ్ రేంజ్ ఎకరానికి రూ.31.2 నుంచి 60.2 కోట్ల వరకు పలికింది. గరిష్ఠ బిడ్ రూ.60 కోట్లు ఒక ఎకరం ప్లాట్‌కు పెట్టి కొనుగోలు చేశారు. ఐదేళ్లోలనే ఈ రేటు రూ. 131 కోట్లకు చేరుకుంది. ప్రెస్టీజ్ గ్రూప్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ వేలం హైదరాబాద్‌ను దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా మారింది. 2023 ఆగస్టు 3న రెండో విడత వేలం జరిగింది. 7 ప్లాట్లు 3.6 నుంచి 9.71 ఎకరాల వరకు ఉన్నాయి. అప్‌సెట్ ప్రై ధర ఎకరానికి రూ.35 కోట్లు కానీ ఎకరానికి రూ.67.25 నుంచి 100.75 కోట్ల వరకు కొనుగోలుచేశారు. గరిష్ఠ బిడ్ రూ.100.75 కోట్లు రాజపుష్పా ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ %–% 3.6 ఎకరాల ప్లాట్‌కు దక్కించుకుంది.

## దావోస్ బిజినెస్ ఫోరమ్ స్థాయిలో ఏర్పాట్లు...

- మొదటి పేజీ తరువాయి

వెళ్లి ఆహ్వానపత్రాలు అందజేస్తారు. ఢిల్లీ ముఖ్యమంత్రికి, కేంద్ర మంత్రులకు, గవర్నర్లకు తెలంగాణ ఎంపీలు ఆహ్వానం అందిస్తారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెళతారు.ఇప్పటికే అనేక మంది పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం వెళ్లింది. కేంద్ర ప్రభుత్వ పెద్దల్ని పిలవడానికి స్వయానా ముఖ్యమంత్రి రేవంతే ఢిల్లీలో మకాం వేశారు. ఇలా, వీలైనంత ఎక్కువమంది పొలిటికల్ ఐకాన్స్‌ని, కార్పొరేట్ దిగ్గజాల్ని రప్పించి సమ్మిట్‌ని సూపర్‌సక్సెస్ చేయాలన్నది టీ-సర్కార్ ఆలోచన. 2034 నాటికి వన్ ట్రిలియన్, 2047 నాటికి త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యాన్ని సాధించడానికి ఈ విజన్ డాక్యుమెంట్‌ని రోడ్ మ్యాప్‌గా భావిస్తోంది రేవంత్ ప్రభుత్వం.ఫోర్త్‌సిటీలో గ్లోబల్ సమిట్ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు, మూడు షిఫ్టుల్లో పనిచేసి వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాలనుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతిని, కళా, వారసత్వ సంపదను పరిచయం చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 5వ తేదీ సీఎం రేవంత్‌రెడ్డి సమ్మిట్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

## చంపేస్తున్న చలి...

- మొదటి పేజీ తరువాయి

చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో పగటితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంత కంటే అధికంగా రికార్డు అవుతాయని పేర్కొంది. ఈ నెల దక్షిణాదిన సాధారణం లేదా అంతకంటే అధికంగా వర్షపాతం రికార్డు అవుతుందని చెప్పింది.ఉత్తర కోస్తాలో సాధారణం కంటే అధికంగా, ఏపీలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అవుతుందని తెలిపింది. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇప్పటికే వాతావరణం చల్లబడింది. దానితో పాటు లా నినా ప్రభావంతో చలి గాలులు పెరుగుతాయని ఐఎండీ చెప్పింది. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు గుడిసెల్లో నివసించే సంచార జాతుల వారు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది.

## వివాదంలో పొంగులేటి కుమారుడు....

- మొదటి పేజీ తరువాయి

ధ్వంసం చేశారు. పొంగులేటి కుటుంబానికి చెందిన కంపెనీ వట్టి నాగులపల్లిలో ఓ ప్రాజెక్ట్ చేపట్టింది. ఆ ప్రాజెక్టు పక్కనే ఈ భూమి ఉన్నట్లుగా తెలుస్తోంది. దాడి చేసినవారు మాఫియా గ్యాంగ్‌లా ప్రవర్తించి, భూమి హద్దుల గోడలు కూల్చి, ఆవుల షెడ్‌ను ధ్వంసం చేశారని ప్రత్యక్ష సాక్షులు పోలీసులుకు చెప్పినట్లుగా తెలుస్తోంది. సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి, వారిని తీవ్రంగా గాయపరిచారు. భయభ్రాంతులైన భూమి యజమానులు సైబరాబాద్ పోలీస్ అధికారికి ఫిర్యాదు చేశారని ఓ యువ పోలీస్ అధికారి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కేసు పెట్టారని బీఆర్ఎస్ నేతలంటున్నారు. అధికారి 120 మంది పోలీసులతో స్థలానికి చేరుకుని, బౌన్సర్ల బృందాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. మంత్రి కుమారుడు , కుటుంబ సభ్యులు ఘటన సమయంలో అక్కడే ఉన్నారని, వారిని కూడా అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపారు. అయితే వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పలుకుబడితో ఆ అధికారిని బదిలీ చేయించారని చెబుతున్నారు. చివరికి, హైదరాబాద్ పోలీసులు రెండు వైపులా కేసులు నమోదు చేశారు, కానీ ప్రధాన ఆరోపణలు అయిన హత్యాయత్నం, భూమి ఆక్రమణ పేర్కొనకుండా చిన్న కేసులుగా మార్చారని అంటున్నారు. ఈ ఆరోపణలపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైపు నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడిపై గతంలోనూ ఈడీ కేసులు ఉన్నాయి. అత్యంత ఖరీదైన వాచ్‌లను ఆయన స్మగ్లింగ్ ద్వారా తెప్పించుకున్నారని చెన్నైలోని కస్టమ్స్ శాఖ అధికారులుకేసులు పెట్టారు. ఈడీ కూడా కేసులు నమోదు చేసింది. పలుమార్లు విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది. అయితే ఆయన హాజరయ్యారో లేదో మాత్రం స్పష్టత లేదు.

## వార్డు 4 లో 9 వ రోజు బస్తీ పర్యటించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ :** బస్తీల సమస్యలు తెలుసుకోవడానికి చేపట్టిన బస్తీల పర్యటనలో భాగంగా గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వార్డు 4 లోని శ్రీనివాసులు గార్డెన్, రాజలింగం గార్డెన్, శ్రీరంగ గార్డెన్స్ లలో కంటోన్మెంట్, స్టేట్ గవర్నమెంట్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించి బస్తీల సమస్యలను తెలుసుకున్నారు.ముఖ్యంగా బస్తీ వాసులకు డ్రైనేజీ పైపు లైన్లు పాడై పోవడంతో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా బోర్డుకు సమకూరిన 303 కోట్ల రూపాయల నుంచి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కంటోన్మెంట్ అధికారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించడంతో అధికారులు అంగీకరించి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.బస్తీ వాసులకు అవసరమైన మెరుగైన మంచినీటి సరఫరా,కమ్యూనిటీ హాళ్ళు,నూతన బోర్ వెల్ ల పనులను త్వరలోనే పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో బస్తీల వాసులు ధన్యవాదాలు తెలపడంతో ఇది నా బాధ్యత అని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.ఈ బస్తీ పర్యటనలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, ఆనంద్, సురేఖ, మహేష్, సాంబశివ,ధనశ్రీ, సంజీవరావు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు
శుక్రవారం 05 డిసెంబర్ 2025

## టీసీయూఆర్‌గా గ్రేటర్ హైదరాబాద్

**హైదరాబాద్, డిసెంబర్ 4:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అనే పేరు ఇక చరిత్రలో కలిసిపోయే అవకాశాలు ఉన్నాయి. ఆరు జోన్లు, 30 సర్కిళ్లతో ఉన్న జీహెచ్ఎంసీ త్వరలోనే తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా మారనున్నట్లు తెలుస్తోంది.దీనిపై సమగ్ర ప్రణాళిక త్వరలో వెలుపడే అవకాశముంది. అలాగే, టీసీయూఆర్ పరిధిలోని ప్రాంతాన్ని మూడు విభాగాలు విభజించే ప్రతిపాదన ఉంది. అధికారిక ప్రకటన త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ఢిల్లీలో ఇలాగే ఎన్సీఆర్ (నేషనల్ కేపిటల్ రీజియన్) ఉన్న విషయం తెలిసిందే. ఆ తరహాలోనే హైదరాబాద్‌లో టీసీయూఆర్ అధికారికంగా మారనుంది. జీహెచ్ఎంసీలో 27 మునిసిపల్ బాడీలను విలీనం చేసి, జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించే క్రమంలో అతి పెద్ద మహానగరంగా మారనుంది హైదరాబాద్.తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా పేరు మార్పునకు మార్గం సుగమం చేసింది. ప్రభుత్వం మూడు ఆర్డినెన్సులను జారీ చేసి, అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో మునిసిపల్ చట్టంలో మార్పులు చేయనున్నట్లు సమాచారం. టీసీయూఆర్ హైదరాబాద్‌కు చట్టబద్ధత కల్పిస్తారు. దీంతో అధికారికంగా విలీన ప్రక్రియ పూర్తికానుంది.

## రాచకొండ, సైబరాబాద్ పోలీస్ వెబ్‌సైట్లు హ్యాక్..




**హైదరాబాద్:** తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.

## శ్రీకాంతాచారి పేరు ఒక్క పథకానికైనా పెట్టారా...

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- చారి విగ్రహం వద్ద నివాళి



**హైదరాబాద్:** ఒక్క ప్రాజెక్టుకైనా అమరుడైన (శ్రీకాంతాచారి ) పేరు పెట్టారా? అని కాంగ్రెస్ నేతలను తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిలదీశారు. అమరులను గౌరవిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ .. రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్ పేర్లనే ప్రాజెక్టులకు పెట్టిందన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా బుధవారం ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. నిజంగా త్యాగం చేసినటువంటి తెలంగాణ బిడ్డల పేర్లు నిలిచేలా పాటుపడాలని, అందుకు తెలంగాణ జాగృతి పాటుపడుతోందన్నారు.

## బీజాపూర్ ఎన్‌కౌంటర్.. 20కి పెరిగిన మృతుల సంఖ్య..



**ఛత్తీస్‌గఢ్, డిసెంబర్ 04**: బీజాపూర్ జిల్లాలో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 20కి పెరిగింది. భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో తొలుత ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్న క్రమంలో మరికొన్ని మావోయిస్టుల మృతదేహాలు కనిపించినట్లు తెలుస్తోంది. మొత్తంగా మృతుల సంఖ్య 20కి చేరినట్లు సమాచారం. పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. బుధవారం జరిగిన ఈ ఆపరేషన్ లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా భద్రతా బలగాలు పాల్గొన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో టెన్షన్ వాతావరణం ఉంది. ఇక్కడ జరిగిన ఎన్‌కౌంటర్లు జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇటీవల మారేడుమిల్లి ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్ల ప్రభావం ఈ ప్రాంతంలో ఇంకా తగ్గలేదు. ఇలాంటి సమయంలో మంగళవారం నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన పీఎల్‌జీవో వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం బీజాపూర్( ప్రాంతంలో భారీ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. ఈ రెండు ఘటన నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

# పోలీసుల బంపర్ ఆఫర్‌కు నో..

## బయటకొచ్చి మరో ఐ బొమ్మ పెడతానన్న రవి...

**హైదరాబాద్, డిసెంబర్ 4:**సినీ పైరసీ వెబ్‌సైట్ ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.. కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. రవి నుంచి కీలక సమాచారం సేకరించారు. ఐ బొమ్మ సినీ పైరసీని రవి ఒక్కడే చేశాడని నిర్ధారించుకున్న పోలీసులు..పైరసీ ద్వారా సంపాదించిన మొత్తంలో 30 కోట్లకు సంబంధించిన బ్యాంకు లావాదేవీ వివరాలను సేకరించారు. అంతేకాకుండా.. పైరసీ కేసు దర్యాప్తులో పోలీసులు మరింత లోతుగా వెళ్తున్నారు.. ఇంత పెద్ద వలయాన్ని నిర్వహించిన రవిపై పోలీసులు ఇప్పటివరకు రెండు విడతల్లో ఎనిమిది రోజులపాటు కస్టడీ తీసుకుని విచారణ జరిపిన విషయం తెలిసిందే. అయితే ఆ విచారణలో బయటకు వచ్చిన కొన్ని కీలక సమాచారాలతో కేసు కొత్త మలుపు తిరిగింది. అందుకే తాజాగా పోలీసులు మరోసారి నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. మొత్తం మూడు వేర్వేరు కేసుల్లో పీటీ వారెంట్ మీద ఇప్పటికే రవిని కోర్టు ఎదుట హాజరుపరచిన సైబర్ క్రైమ్ అధికారులు.. ఇప్పుడు ఈ మూడు కేసులన్నింటికీ ఐదు రోజులపాటు కస్టడీ ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసుల్లో ఉన్న డిజిటల్ సాక్ష్యాలు, లావాదేవీల రూట్లు, రవి ఇచ్చిన సమాధానాల్లోని లూప్‌హోల్స్ దృష్ట్యా మరింత లోతైన దర్యాప్తు అవసరమని పోలీసులు కోర్టులో వాదించనున్నట్టు తెలిసింది. రవిపై ఇప్పటికే రెండుసార్లు విచారణ జరిగినప్పటికీ, అతను చెప్పిన కొన్ని విషయాలు తాజాగా బయటపడిన వివరాలతో అసలు



సరిపోవడం లేదని అధికారులు భావిస్తున్నారు. పైరసీ నెట్‌వర్క్‌ను ఏ విధంగా నడిపాడు? ఎంతమంది మధ్యవర్తుల ద్వారా డబ్బులు చలామణి అయ్యాయి? వేరే దేశాల్లో ఉన్న సర్వర్లతో సంబంధం ఉందా? ఈ విషయాలన్నింటికి పూర్తి క్లారిటీ రావాలంటే మరోసారి కస్టడీ తప్పదని పోలీసులు అంటున్నారు. సైబర్ క్రైమ్ అధికారులు విచారణలో ఒక ఇన్‌ట్రెస్టింగ్ ప్రశ్న వేసినట్టు సమాచారం.. "సైబర్ క్రైమ్ విభాగంలో మంచి శాలరీతో ఉద్యోగం చేస్తావా?" అని పోలీసులు రవిని అడిగారు.. దీనికి రవి ఒప్పుకోలేదు. అతను జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కరేబీయన్ దీవుల్లో రెస్టారెంట్ పెట్టాలని ప్లాన్ చేస్తున్నట్టు చెప్పినట్లు తెలుస్తోంది.. ఇకపై నేరాలకు, పైరసీకీ దూరంగా సక్రమ మార్గంలో జీవించాలని అనుకుంటున్నట్టు తెలిపాడని పేర్కొంటున్నారు.. రెస్టారెంట్ కు ఏం పేరు పెడతావని.. ప్రశ్నించగా.. ఐబొమ్మ పేరు పెడతానని సమాధానం ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. "తప్పు చేశానని ఒప్పుకున్నాను.. ఇకపై ఎన్నడూ పైరసీ చేయను" అని రవి కొంత సాఫ్ట్ మోడ్‌లో సమాధానమిచ్చినట్టు సమాచారం..రవిని వివిధ కోణాల్లో పరీక్షించేందుకు మూడోసారి కస్టడీ అవసరం అని పోలీసులు భావించారు పైరసీ నెట్‌వర్క్‌లో ఇంకా బయటకు రాని వ్యక్తులు ఉన్నారు. రవి ఇచ్చిన డేటాను క్రాస్ చెక్ చేయడానికి మరోసారి అతని విచారణ అవసరమని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా అనుమానాస్పద ట్రాన్సాక్షన్లు, అంతర్జాతీయ లింకులు, %ూచీ% నెట్‌వర్క్‌లో సాగిన కమ్యూనికేషన్ .. ఇవన్నీ రవిని ఎదిరించి అడగాల్సిన ప్రశ్నలే అని తెలుస్తోంది.మరోవైపు రవి తరఫు న్యాయవాదులు పూర్తిగా వేరే కోణంలో వాదిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు విచారణ జరిగిందని, అప్పటికే పోలీసులు తమకు కావలసిన సమాచారాన్ని తీసుకున్నారని, ఇక మళ్లీ కస్టడీ అవసరం లేదని వాదిస్తున్నారు. రవికి నిర్దోషిత్వ అవకాశాలు ఉన్నాయని, మరింతగా కస్టడీ ఇవ్వడం చట్టవిరుద్ధమని వాదన సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రవి బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు కాసేపట్లో తీర్పు చెప్పబోతోంది. బెయిల్ రాకపోతే పోలీసులు కోరిన మూడో విడత కస్టడీకి మార్గం సుగమం అవుతుంది. బెయిల్ మంజూరు అయితే పరిస్థితి పూర్తిగా మారిపోతుందని పేర్కొంటున్నారు.

# 40,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

**హైదరాబాద్, డిసెంబర్ 4:**తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో తాము అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 60,000 ఉద్యోగాలు ఇచ్చామని, ప్రజాపాలన రెండున్నరేళ్ల పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని అన్నారు.త్వరలోనే మరో 40,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. మరోవైపు, వైద్యారోగ్యశాఖలో 7,267 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని కాంగ్రెస్ సర్కారు చెప్పింది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఈ శాఖలో 9,203 పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైద్యరంగంలో సాధించిన ప్రగతిపై సర్కారు విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలు తెలిపింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద



ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించింది. ఇందులో కొత్తగా 163 రకాల చికిత్సలను చేర్చినట్లు వివరించింది. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్యను పెంచుతున్నామని చెప్పింది.తెలంగాణలో కొత్తగా 9 ప్రభుత్వ వైద్య కాలేజీలను ఏర్పాటు చేశామని, దీంతో అదనంగా 450 ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయని పేర్కొంది. 16 కొత్త నర్సింగ్ కళాశాలల వల్ల తెలంగాణలో వాటి సంఖ్య 37కు చేరిందని చెప్పింది. రెండేళ్లలో 28 పారామెడికల్ కళాశాలలను సర్కారు ప్రారంభించినట్లు తెలిపింది.

త్వరలో ఈ పోస్టుల భర్తీ
1,623 స్పెషలిస్టు డాక్టర్లు
607 అసిస్టెంట్ ప్రొఫెసర్లు
48 డెంటల్ డాక్టర్లు
2,322 స్టాఫ్‌నర్సులు
732 ఫార్మసిస్టులు
1,931 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మహిళ)
నాలుగు స్పీచ్ పాథాలజిస్టు

## హైదరాబాద్ ప్రైవేట్ రాకెట్ ప్రత్యేకతలేంటి?

**హైదరాబాద్, డిసెంబర్ 4:**'ఓపెనింగ్ స్పేస్ ఫర్ ఆల్ (అంతరిక్షంలో అందరికీ అవకాశం)"ఈ నినాదంతో స్థాపించిన హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ రాకెట్‌ను తయారు చేసింది. ఇది భారతదేశపు తొలి వాణిజ్య ఆర్బిటాల్(భూకక్ష్య ) రాకెట్‌గా ప్రకటించింది.ఈ రాకెట్‌కు భారత అంతరిక్ష పితామహుడిగా పేరొందిన విక్రమ్ సారాభాయ్ పేరుతో విక్రమ్-1గా నామకరణం చేసింది.ఇప్పటివరకు రాకెట్లు అంటే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆధ్వర్యంలోనే తయారయ్యేవి.అయితే, కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష సాంకేతికతలో ప్రైవేట్ సంస్థలకు అవకాశాలు కల్పించడంతో విక్రమ్-1 రాకెట్‌ను తయారు చేసి ప్రయోగానికి సిద్ధమవుతోంది స్కైరూట్ ఏరో స్పేస్ కంపెనీ.ఉపగ్రహాల(శాటిలైట్స్)ను అంతరిక్షంలోకి తీసుకెళ్లడంలో లాంచ్ వెహికల్స్‌దే కీలకపాత్ర.ఉపగ్రహాల బరువును బట్టి లాంచ్ వెహికల్‌ను ప్రయోగిస్తుంటారు.ఇస్రో తరఫున పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్(పీఎస్ఎల్వీ), జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్(జీఎస్ఎల్వీ) వంటి వాటిని ఉపయోగిస్తున్నారు.వీటిల్లో పీఎస్ఎల్వీకి సుమారు 1400 కిలోల బరువు వరకు మోసుకెళ్లే సామర్థ్యం ఉంది.జీఎస్ఎల్వీకి సుమారు 4 వేల నుంచి 6 వేల కిలోల పేలోడ్ సామర్థ్యం ఉంది.స్పేస్ టెక్నాలజీలో ప్రైవేటు పెట్టుబడులు లేదా కంపెనీలకు అవకాశం కల్పించాలని జూన్ 2020లో కేంద్ర కేబినెట్ నిర్ణయించడంతో ఈ రంగంలో పెద్దసంఖ్యలో కంపెనీలు ఏర్పాటయ్యాయి.అప్పటికి రెండేళ్ల కిందటే 2018లో స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీ ప్రారంభించారు ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, భరత్ కుమార్ డాకా."ఆ సమయంలో పెద్దగా ఫండింగ్ లేదు. స్పేస్ టెక్నాలజీలో అంత ప్రతిభ లేదు. భారత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో లబ్ధి పొందాం" చెప్పారు పవన్ కుమార్.పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీతో పోల్చితే స్కైరూట్ అభివృద్ధి చేసిన విక్రమ్ -1 లాంచ్ వెహికల్ పే లోడ్ సామర్థ్యం చాలా తక్కువే.దీని పే లోడ్ సామర్థ్యం 500 కిలోలుగా ఉందని, ప్రాథమికంగా 350 కిలోల పే లోడ్ సామర్థ్యంతో ప్రయోగాలు చేపడతామని పవన్ కుమార్ చెప్పారు ."40 టన్నుల బరువు, 20 మీటర్ల ఎత్తుతో లాంచ్ వెహికల్ ఉంటుంది" అని చెప్పారు.భూ ఉపరితలం నుంచి 500 కిలోమీటర్ల వరకు అంతరిక్షంలోకి వెళ్లగలదని స్కైరూట్ కంపెనీ చెబుతోంది.సెకనుకు 8 కిలోమీటర్ల వెలాసిటీతో శాటిలైట్‌ను ప్రవేశపెట్టే సామర్థ్యం కలిగివుంది.1.7 మీటర్ల వ్యాసంతో 1200 కేఎన్ థ్రస్ట్ సామర్థ్యంతో లాంచ్ వెహికల్ తయారైంది.త్రీడీ ప్రింటెడ్ లిక్విడ్ ఇంజిన్ కారణంగా సాధారణ ఇంజిన్‌తో పోలిస్తే 50 శాతం తక్కువ బరువుంటుంది. సాలిడ్ ఫ్యూయెల్ బూస్టర్స్, కార్బన్ కంపోజిట్ స్ట్రక్చర్ (కార్బన్ ఫైబర్‌తో తయారైనవి) కలిగివుంది.ఏరోస్పేస్ కంపెనీ 2022 నవంబర్ 18న సబ్ ఆర్బిటాల్(భూ ఉప క్షక్ష్య) లాంచ్ వెహికల్‌ను ప్రయోగించింది. దీనికి అప్పట్లో విక్రమ్-ఎస్‌గా నామకరణం చేశారు.ఇది భూమి ఉపరితలం నుంచి 80 కిలోమీటర్ల వరకు వెళ్లి భూ ఉపకక్ష్యను తాకింది. కానీ, దీనికి శాటిలైట్‌ను ప్రవేశపెట్టే సామర్థ్యం లేదు. "విక్రమ్- ఎస్ అనేది టెస్ట్ రాకెట్ మాత్రమే" అని పవన్ చెప్పారు.ఆ ప్రయోగం విజయవంతం కావడంతో విక్రమ్-1 లాంచ్ వెహికల్ చేపట్టి మూడేళ్లలోనే పూర్తి చేసినట్లుగా పవన్ కుమార్ చందన చెప్పారు ."భవిష్యత్తులో ప్రతి నెలా ఒక లాంచ్ వెహికల్ తయారు చేసి అందుబాటులోకి తీసుకురావాలనేది మా లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం



2023లో ఇండియన్ స్పేస్ పాలసీ తీసుకొచ్చింది.ప్రభుత్వేతర సంస్థలు కూడా అంతరిక్ష సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఈ పాలసీ ఎంతో కీలకంగా మారిందని ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్ చెప్పారు."స్పేస్ పాలసీ స్కైరూట్ వంటి ఎన్నో సంస్థలకు మరింత చేయూతనిచ్చింది" అని ఆయన అన్నారు.ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్ స్పేస్) నిబంధనలకు లోబడి ప్రైవేటు సంస్థలు పనిచేయాల్సి ఉంటుంది.మూడేళ్ల కిందట ఇన్ స్పేస్ ప్రారంభించడం వెనుక ఉద్దేశం.. ప్రైవేట్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవకాశం కల్పించాలన్నదే అని ఇన్ స్పేస్ ఛైర్మన్ పవన్ గోయెంకా చెప్పారు.విక్రమ్ -2 లాంచ్ వెహికల్‌ను 2026లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా భరత్ కుమార్ డాకా చెప్పారు.కంపెనీ చెబుతున్న వివరాల ప్రకారం, విక్రమ్-2 లాంచ్ వెహికల్ 900 కిలోల పేలోడ్ సామర్థ్యంతో తయారు చేస్తున్నట్లుగా ఉంది. ఇందుకు అడ్వాన్స్‌డ్ క్రయోజెనిక్ ఇంజిన్ తయారు చేస్తున్నట్లగా చెబుతోంది.భవిష్యత్తులో రీ యూజబుల్ లాంచ్ వెహికల్స్(రాకెట్స్) తయారు చేయాలనే ఆలోచన ఉన్నట్లుగా పవన్ చెప్పారు.ప్రపంచ దేశాలకు శాటిలైట్స్ లాంచ్ చేయడానికి రాకెట్ల అవసరం చాలా ఉందని, ఆ ఆలోచనతోనే లాంచ్ వెహికల్స్ తయారీకి స్కైరూట్ నిర్ణయించిందని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా ప్రైవేటు రాకెట్ తయారీ కంపెనీలు పెద్దయెత్తున వస్తున్నాయి. అమెరికాలో స్పేస్-ఎక్స్ సహా వివిధ సంస్థలున్నాయి. రాకెట్స్ తయారు చేస్తున్నాయి. భారత్‌లో లాంచ్ వెహికల్స్‌ను ప్రైవేటు కంపెనీలు తీసుకురావడం కీలక మలుపుకానుంది.2015 నుంచి 2024 మధ్య 393 విదేశీ, మూడు స్వదేశీ కమర్షియల్ శాటిలైట్స్‌ను ఇస్రో ప్రయోగించింది. దీని ద్వారా 439 మిలియన్ యూఎస్ డాలర్ల ఆదాయం సమకూరింది.భారత స్పేస్ రంగంలో 2024లో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్డీఐ) అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.దేశీయంగా ఇప్పటికే స్పేస్ టెక్నాలజీలో 300కుపైగా స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని పవన్ గోయెంకా చెప్పారు.ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ డేటా ప్రకారం, సెప్టెంబర్ 30, 2025 నాటికి 376 స్టార్టప్‌లు కేంద్రానికి దరఖాస్తు చేసుకున్నాయి.ఒకే ఒక్క స్టార్టప్ ఉండగా , 2024 నాటికి 200 కంపెనీలు వచ్చాయని నిరుడు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రకటించింది.గ్లోబల్ స్పేస్ ఇండస్ట్రీలో భారత్ వాటా 2021లో రెండు శాతం (8.4 యూఎస్ బిలియన్ డాలర్లు)గా ఉంది.2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, ఎగుమతులు 11 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని భారత ప్రభుత్వం అంచనా వేస్తోంది.

## ఒకే ఇంటినుంచి పోటీలో అత్తా కోడలు




**అదిలాబాద్:**ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది.. జిల్లాలో సర్పంచ్ ఎన్నికల పోటీలో ఒకే ఇంటి నుంచి అత్తా కోడళ్లు బరిలో నిలిచిన ఘటన చర్చనీయాంశం అవుతోంది... చదవుకోకున్నా తెలివితో పనిచేస్తానని అత్త చెబితే.. చదువుకున్న అమ్మాయిని గ్రామానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోడలు అంటోంది.. ఇక అత్త కోడళ్ల పోటీ ఎలా ఉండబోతుందో అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు..ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ గ్రామపంచాయతీ నుండి వాళ్లిద్దరూ నేనంటే నేను అంటూ పోటీకి దిగారు. మొదటి విడతలో నామినేషన్ కూడా వేసారు. ఇప్పుడు పోటీకి నేనంటే నేను సై అంటూ ముందుకు వెళ్తున్నారు ఈ అత్తా కోడళ్ళు.. ఒకే కుటుంబంలో వీరి పోటీని చూసి అందరూ ఆశ్చర్య పోతున్నారు. గ్రామానికి చెందిన నాగోరావు భార్య తోడసం లక్ష్మీ బాయి, కొడుకు భార్య తోడసం మహేశ్వరి లు సర్పంచ్ బరిలో నిలిచారు.. ఈసారి మా గ్రామపంచాయతీ ఎన్నికల్లో మహిళ రిజర్వేషన్ రావడం తో సంతోషంగా ఉందని, మా కుటుంబం నుండి ఇద్దరం మహిళలం పోటీచేస్తున్నామని, ఎవరిదీ వారే తమ గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి గెలుపు ఎవరిని వరిస్తుందో, ఓటర్లు చదువుకున్న కోడలికి ఓటు వేస్తారో, లేదా సేవ చేస్తానంటున్న అత్తకు ఓటు వేస్తారో వేచి చూడాలి.... ఏది ఏమైనా ఒకే కుటుంబం నుండి ఇద్దరు మహిళలు పోటీ చేయడం పట్ల గ్రామంలో పెద్ద చర్చ మొదలైంది..

## ధాన్యం అక్రమ రవాణా

### 11 లారీలు స్వాధీనం

**మిర్యాలగూడ:**మిర్యాలగూడ మండలం ఆలగడప టోల్ గేటు వద్ద 11 ధాన్యం లారీలను పట్టుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ధాన్యం లారీలు తరలించినట్లు గుర్తించారు. ధాన్యం లారీలను స్వాధీనం చేసుకొని..డ్రైవర్లను రూరల్ పోలీసులు విచారిస్తున్నారు. ఇతర రాష్ట్రాల ధాన్యం తెలంగాణలో విక్రయించేందుకు అనుమతి లేదు. దళారులు ధాన్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి రైస్ మిల్లులో విక్రయిస్తున్నట్లు సమాచారం.

# నేడు శ్రీ తిమ్మప్ప స్వామి మహారథోత్సవం

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 3 (స్కై న్యూస్):**ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతుండగా గురువారం రాత్రి మహారాతోత్సవం లక్షలాదిమంది భక్తుల మధ్య జరగనుంది. గత నెల 25న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు దాదాపు 12 రోజులపాటు జరగనున్నాయి.గురువారం జరిగే మహా రథోత్సవానికి కర్ణాటక తెలంగాణ ఆంధ్ర తదితర ప్రాంతాల భక్తులు లక్షలాదిగా తరలివచ్చి స్వామివారికి దాసంగాలు సమర్పించనున్నారు. ఇందుకోసం దేవాదాయ శాఖ పంచాయతీరాజ్ పోలీసు వైద్యశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలలో పీఠాధిపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.





**స్వామివారి చరిత్ర**

జోగులాంబ గద్వాల జిల్లా మరదల్ మండల కేంద్రంలో కలిసిన శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కలియుగ ఆరంభంలో ఒక శిలపై ఉద్భవించాడని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ ఈశ్వరుడు తపము ఆచరించగా అనిరుద్ధరూపంలో శ్రీమహావిష్ణువు దేవతలతో కలిసి ఇక్కడ ఉద్భవించాడని చెబుతున్నది. ఒకానొక సమయంలో ఈ ప్రాంతం అటవీ క్షేత్రంగా ఉండేది. గద్వాల పరిపాలించిన సంస్థానాధీశులు నల్ల సోమనాద్రి ఈ ప్రాంతానికి వేటకు రాగా ఆయన వెళుతున్న గుర్రం ఈ దేవాలయ సమీపంలో ముందుకు వెళ్లకుండా నిలిచిపోయింది. దీంతో రాజుకు ఇక్కడ ఏదో మహిమ ఉన్నదని గమనించి అక్కడే ఉన్న వాల్మీకి బాలుడిని పిలిచి అడగగా ఒక శిలపై స్వామివారు ఉన్నారు కావున ఇక్కడ ఆ మహిమ ఉందని తెలిపాడు. దాంతో రాజు స్వామి వారి కి నమస్కరించి పెద్ద దేవాలయం నిర్మిస్తానని మొక్కుకొని బయలుదేరగా గుర్రము ముందుకు సాగింది. అనంతరం రాజు దేవాలయం నిర్మించి వందల ఎకరాలు స్వామివారికి అందజేసి మహారతాన్ని ఏర్పాటు చేశాడు. నాటినుండి నేటి వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి.

**భక్తుల దాసంగాలు**

వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు రథోత్సవం రోజున స్వామివారికి కొత్త కుండలో అన్నం పరమాన్నం వండి స్వామివారికి నివేదన చేసి తిరునామాలతో ఆ కుండను ఇంటికి తీసుకువెళ్లి తిమ్మప్ప స్వామిగా కొలుస్తారు. స్వామివారు మాడవీధులలో పల్లకి సేవ జరిగే సమయంలో ప్రతి ఒక్కరూ క్రింద నుండే స్వామి వారికి నమస్కరించాలని ఆనవాయితీ ఉన్నందున ఎవరు కూడా రెండవ అంతస్తు నిర్మించరు. ఆదిశలపై వెలసిన శ్రీనివాసుడు వెలిసినందున మల్దకల్ గ్రామస్తులు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వెళ్లరు. ఒకవేళ వెళితే ఏదైనా అపవాది జరుగుతుందని భావించి ఇప్పటివరకు మల్దకల్ గ్రామస్తులు తిరుపతి వెళ్లలేదు.

**దినదినాభివృద్ధి చెందుతున్న దేవాలయం**

అపర తిరుపతిగా వెలసిల్లుతూ అనేకమంది భక్తుల కోరికలు తీరుస్తూ మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి ఇలవేల్పుగా నిలిచాడు. అనేకమంది భక్తులు దేవాలయ అభివృద్ధికి సహకరిస్తున్నారు. ప్రస్తుత ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద ఈవో సత్య చంద్రారెడ్డి, ఎస్సై నందికర్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

# నిరంతరం అప్రమత్తంగా ఉండాలి...

**పకడ్బందీగాస్థానిక ఎన్నికలకు బందోబస్తు...**

**బ్రహ్మోత్సవాలకు భద్రతా ఏర్పాట్లు పూర్తి.. .**

**జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్...**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 4 (స్కై న్యూస్)** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంలో జిల్లాలో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేసి పోలీసు అధికారులు చెక్ పోస్టులలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తనిఖీలను విస్తృతం చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ కోరారు గురువారం జిల్లాలోని నల్లమల్ల ప్రాంతంలోని మున్ననూరురు గ్రామంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా తన కీలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి ఎన్నికల సమయంలో అక్రమంగా డబ్బు మద్యం నిషేధిత వస్తువులు సరఫరా అయ్యే ప్రమాదం ఉందని విధులలో ఉన్న పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలను నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను వాహనాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన చర్యలు తప్పవని హెచ్చరించారు అనంతరం అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి పల్కపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని ఎన్నికలు ముగిసే వరకు నిబంధనలను ఎవరు తుంగలో తొక్క వద్దని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ అర్చకులు కమిటీ ప్రత్యేకంగా స్వాగతం పలికి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో అచ్చంపేట పోలీసు ఉన్నతాధికారులతో పాటు పలువురు పాల్గొన్నారు



## శ్రీ తిమ్మప్ప స్వామి ని దర్శించుకున్న ఎస్పీ



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 4 (స్కై న్యూస్):**ఆది శిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు,ఈఓ సత్య చంద్రారెడ్డి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం దేవాలయం లో అర్చనలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారి చరిత్ర, బ్రహ్మోత్సవాలు గురించి వివరించారు.అనంతరం ఎస్పీని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, సి ఐ శ్రీను, ఎస్సై నందికర్,పట్వారి అరవిందరావు, చంద్రశేఖర రావు,మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామాగ్రి పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్



**నారాయణపేట డిసెంబర్ 4 (స్కైన్యూస్)** గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కు సంబంధించిన సామాగ్రి పంపిణీని కార్యక్రమాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీ దత్త బృందావన్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. జిల్లాలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే కోస్గి, కొత్తపల్లి, గుండుమల్, మద్దూర్ మండలాలలోని అన్ని గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కోసం అవసరమైన బ్యాలెట్ పేపర్లు, బాక్సులు, ఇతర సామాగ్రి అన్ని సరిగ్గా ఉన్నాయా లేదా అని కలెక్టర్ సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ ల ఎన్నిక కోసం, వార్డు సభ్యుల ఎన్నిక కోసం ముద్రించిన బ్యాలెట్ పేపర్లను కలెక్టర్ పరిశీలించారు. అదే విధంగా రెండు, మూడో విడత ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్న బ్యాలెట్ బాక్స్ లను ఆమె పరిశీలించి, ఇంకా ఏమైనా అవసరమైతే తెప్పించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ఎస్ డి సి రాజేందర్ గౌడ్, డిపిఓ సుధాకర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, మద్దూరు, గుండుమల్ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# నాగారం సర్కిల్ లో అక్రమ సెల్లార్

**సికింద్రాబాద్ జోన్ పరిధిలోని నాగారం సర్కిల్లో అక్రమ నిర్మాణాలు**

**విలీనం మున్సిపాలిటీ కమిషనర్లను మారుస్తారా లేక కొనసాగిస్తారా అంటున్న స్థానిక ప్రజలు**

**గత కమిషనర్లను బదిలీలు చేస్తేనే అభివృద్ధి సాధ్యం అంటున్నా స్థానిక నాయకులు, సోషల్ వర్కర్స్, ప్రజలు**




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 4 (స్కై న్యూస్) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సికింద్రాబాద్ జోన్ లోని నాగారం సర్కిల్లో అక్రమ సెల్లార్, అక్రమ షెడ్ల నిర్మాణం, అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణం పట్టించుకోని అధికారులు చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సికింద్రాబాద్ జోన్ లోని నాగారం సర్కిల్లో అక్రమ సెల్లార్ తవ్వకాలను పట్టించుకోని అధికారులు చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు అంటున్న స్థానికులు. నాగారం మున్సిపాలిటీలో అక్రమ బహుళ అంతస్తులు, అక్రమ షెడ్లు, అక్రమ సెల్లార్లకు ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేస్తుంటే అధికారులు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాగారం గతంలో మున్సిపాలిటీ గా ఉండేది ఇప్పుడు నాగారం సర్కిల్ గా డిప్యూటీ కమిషనర్ భాస్కర్ రెడ్డి గా ప్రభుత్వం నిర్ణయించడంతో జిహెచ్ఎంసికి శివారు మున్సిపాలిటీలు అన్ని జిహెచ్ఎంసి లో విలీనం కావడంతో అక్కడ ఉన్నటువంటి కమిషనర్లు డిప్యూటీ కమిషనర్ గా పదవులు ఇస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. అందులో భాగంగానే సికింద్రాబాద్ జోన్లో పరిధిలోకి వచ్చే నాగారం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ గా ఉన్నప్పుడే ప్రోత్సహించారని ఇప్పుడు డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిహెచ్ఎంసి పరిధిలోకి వచ్చిన అనంతరం చర్యలు వేగవంతం చేస్తారా లేకుంటే గతంలో చేసిన తరహాలోనే పని చేస్తారా అన్న సందేహంలో ప్రజలు ఉన్నామన్నారు. డిప్యూటీ కమిషనర్లు వాళ్ల కింద ఉండే సిబ్బంది అందరూ జిహెచ్ఎంసి పరిధిలోకి వచ్చారని జిహెచ్ఎంసి కి నినిధు పెంచి అభివృద్ధి చేస్తారా గాలికి వదిలేస్తారా అన్న సందేహంలో ప్రజలు ఉన్నామని తెలిపారు. విలీనం అయినటువంటి మున్సిపాలిటీలలో అభివృద్ధి చెందుతున్న కాలనీలో పెద్ద మొత్తంలో ఉన్నాయని వాటికి సరిపడా నిధులు ప్రభుత్వం సమకూరుస్తుందా లేక పన్నుల భారం మరింత పెంచి పన్నుల రూపేనా వసూలు చేసి అభివృద్ధి చేస్తారా అన్న సందిగ్ధంలో ప్రజల ఉన్నామని అన్నారు. గతంలో మున్సిపాలిటీ ఉన్నప్పుడే అంతంత మాత్రం జరిగిన అభివృద్ధి పనులు జిహెచ్ఎంసి పరిధి విస్తరించినంక అభివృద్ధి చేస్తారా లేదా అన్న అనుమానాలు రేతేకిస్తున్నాయని ప్రజలు తీవ్ర ఆందోళనలో వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కుంటుపడిన అభివృద్ధి పనులు, రోజురోజుకీ వ్యాపారాల్లో నష్టాలు ఇలా జరిగితే తెలంగాణలో అభివృద్ధి జరిగేది ఎలా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంక్లిష్టమైన పరిస్థితిని అధిగమిస్తుందా లేక కోరుకపోతుందా అన్న సందిగ్ధానికి వేచి చూడాల్సిన అవసరం ఎంతో ఉంది.

# రోశయ్య సేవలు చిరస్మరణీయం



**నారాయణపేట డిసెంబర్ 4 (స్కైన్యూస్)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా పనిచేసిన కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో ఏర్పాటు చేసిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమానికి హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఎన్నో సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేశారని తెలిపారు.. అనంతరం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా పని చేసి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. రాజకీయాలలో స్వచ్ఛమైన వ్యక్తిగా గుర్తింపు పొందారని, రోశయ్య వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్, కలెక్టరేట్ ఏ.వో. శ్రీధర్, డిపిఆర్ఓ రషీద్, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతర భక్తులకు త్రాగునీటి ట్యాంకర్ ఏర్పాటు



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 3 (స్కై న్యూస్):**ఆదిశిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మల్దకల్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో మూడు వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. బుధవారం మల్దకల్ ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి, మేనేజర్ నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకులను పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ బ్యాంకు ఆధ్వర్యంలో జాతర భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగేంద్రబాబు, ఆర్డిఓ యశ్వంత్, ఎల్ బి ఓ కీర్తి, క్యాషియర్ అచ్యుత్, సిబ్బంది ఆశన్న, రఘు, వెంకటమ్మ, మాజీ సర్పంచ్ సీతారామరెడ్డి, మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజు, నరేందర్, బాదామి శ్రీనివాసులు, బాదామి రాజు, వీరారెడ్డి, వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## "డా. సుహాసిని రెడ్డి"ఆకస్మిక మరణం

**గద్వాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి తీరని లోటు...**



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 4(స్కై న్యూస్):** ఉదార వేత్త, సౌమ్యురాలు, మృదుభాషి మరియు సామాజిక స్పృహగల రాజకీయ నాయకురాలు, మానవతా దృక్పథం కలిగిన వైద్యురాలిగా సేవ చేసిన జ్ఞానశీలి స్వర్గీయ డాక్టర్ సుహాసిని రెడ్డి గురువారం తెల్లవారుజామున స్వర్గస్తులైనారని వారి కుటుంబ సభ్యుల ద్వారా తెలిసి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లూ సంఘాల అయ్యపు రెడ్డి తెలిపారు. డా. సుహాసిని రెడ్డి తమ సహధర్మచారి డాక్టర్ విక్రమసింహా రెడ్డి గారితో కలిసి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో పోషక సభ్యురాలిగా చేరి, కొత్తగా జిల్లాలో ఏర్పడిన రెడ్ క్రాస్ శాఖకు వెన్నుదన్నుగా నిలిచారు. అంతేకాకుండా, భవిష్యత్తులో రెడ్ క్రాస్ సొసైటీ చేపట్టబోయే సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు, సలహాలు అందిస్తానని మా అందరిలో ధైర్యాన్ని నింపిన స్ఫూర్తి దాత ఆమె.?జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రతి ముఖ్య సమావేశానికి తన భర్తతోపాటు హాజరై, తమ అనుభవాలను పంచుకుంటూ, భవిష్యత్ కార్యాచరణపై విలువైన సూచనలిచ్చిన మార్గదర్శిణి డా. సుహాసిని రెడ్డి. అలాంటి సామాజిక స్పృహ గల డాక్టర్ సుహాసిని రెడ్డి గారు మన మధ్యలో లేరని తెలుపుటకు చింతిస్తూ... వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని, ఆరోగ్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని మనసారా ఆకాంక్షిస్తూ, ఆమెకు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున ఘనంగా నివాళు లర్పిస్తున్నాము.

## రాండమైజేషన్ ద్వారా కేటాయింపు ప్రక్రియ పూర్తి ...



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 3 (స్కై న్యూస్):**2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు.బుధవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్లో ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్ తో కలిసి తొలి విడత పోలింగ్ సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలోని గద్వాల్, ధరూర్,కేటీ దొడ్డి,గట్టు (4)మండలాల్లో నిర్వహించనున్న తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం 974 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.వీటిలో విధులు నిర్వర్తించడానికి పీఓలు 974, ఓపీఓలు 1,236 సిబ్బందిని రెండవ ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఒక్కో మండలానికి సంబంధించిన గ్రామపంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం అవసరమైన పోలింగ్ అధికారులను ర్యాండమైజేషన్ విధానంలో కేటాయించినట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్ వెర్ వినియోగిస్తూ ఆన్లైన్ లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో గ్రామస్థాయి ఎన్నికలను పరదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీకాంత్, జెడ్పీ డిప్యూటీ సి.ఈ.ఓ నాగేంద్రం, ఈడియం శివ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి అభినందనీయం

**వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షులు వాసా ఈశ్వరయ్య....**



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 4( స్కై న్యూస్)** వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి ఎంపీ మల్లురవి తోడ్పాటు అందించేందుకు హైమాక్స్ లైట్లు మంజూరు చేసేందుకు కృషి చేశారని ఆలయ అభివృద్ధికి కృషి చేసే దాతలకు ఆలయ అధ్యక్షులు వాసా ఈశ్వరయ్య అభినందనలు తెలిపారు గురువారం జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఆభరణలో ఎంపీ మల్లురవి నిధులతో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్లు ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఆలయ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ఆర్యవైశ్య నాయకులు కృషి చేయడం వల్లే అధునాతనంగా ఆలయాన్ని నిర్మించడం జరిగిందని వివరించారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు నిధుల మంజూరుకు సహకరించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నేత వల్లభ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు ఈ పూజా కార్యక్రమంలో శ్రీ సాయి బాలాజీ సిండికేట్ సభ్యులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు శుక్రవారం 05 డిసెంబర్ 2025

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన అబ్జర్వర్



**నారాయణపేట డిసెంబర్ 4 (స్కై న్యూస్)** జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే మక్తల్ నియోజక వర్గంలోని గుడే బల్లూరు నామినేషన్ స్వీకరణ కేంద్రాన్నీ గురువారం జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని,పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దని ఆమె సూచించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను ఆమె పరిశీలించారు.

## షాద్ నగర్ లో ఘనంగా దత్త పౌర్ణమి



శివ మారుతి గీత అయ్యప్ప దేవాలయంలో దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవంలో భాగంగా చివరి రోజు దత్త పౌర్ణమిని పురస్కరించుకొని దత్తాత్రేయ స్వామికి ప్రాతకాల సుప్రభాత సేవ, మూల విరాట్ కు విశేష పంచామృతాభిషేకం సామూహిక, అభిషేకం సహస్ర పుష్పార్చన, దత్త హోమం, డోలారోహణోత్సవం, తదుపరి మహా మంగళ హారతి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు లస్కర్ ఆంజనేయులు గుప్త, దేవాలయ ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, రాజశేఖర్ రెడ్డి, గుబ్బ ప్రకాష్, హరిబాబు మురళి నరసింహ చారి, పట్నానికి చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్థంతి సందర్భంగా నివాళులర్పించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్





**నారాయణపేట డిసెంబర్ 4 (స్కైన్యూస్)** మాజీ ముఖ్యమంత్రి, ప్రకాశవంతమైన ప్రజా జీవితానికి ప్రతీకగా నిలిచిన కొణిజేటి రోశయ్య వర్థంతి సందర్భంగా నేడు జిల్లా పోలీసు కార్యాలయంలో, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...**

రోశయ్య రాజకీయాలలో దశాబ్దాల పాటు వివిధ కీలక బాధ్యతలు నిర్వహించి, ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకొని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ కృషి చేసిన ప్రజా నాయకుడు అని అన్నారు. ఆయన నిర్వాహణా ప్రతిభ, సరళమైన జీవన విధానం ప్రజలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, జిల్లా పోలీస్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేదిక్ మాథ్స్ పోస్టర్ - వర్క్‌బుక్స్ ఆవిష్కరించిన కలెక్టర్



**నారాయణపేట డిసెంబర్ 4 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లాలో జరుగుతున్న "చదువుల పండుగ" కార్యక్రమం కింద, విద్యార్థుల గణాంక సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో అమలు చేస్తున్న వేద గణితం / సూపర్ మాథ్స్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్–వర్క్‌బుక్స్ ను గురువారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ,"వేదిక్ మాథ్స్ కార్యక్రమాన్ని మరింత సమగ్రంగా, ఫలితాల దిశగా అమలు చేయాలి. ఇందుకు పాఠశాలల ఉపాధ్యాయులు కూడా చురుకైన భాగస్వామ్యం చూపించి, విద్యార్థులను నిరంతరం ప్రోత్సహించాలని" ఆమె సూచించారు. కాగా ఈ ప్రోగ్రామ్ ద్వారా జిల్లాలోని ఎంపిక చేసిన 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 4,407 మంది విద్యార్థులకు వేగవంతమైన గణన, లాజికల్ థింకింగ్, ప్రాథమిక గణిత నైపుణ్యాల పటిష్ఠతపై 90 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని వేదిక్ మాథ్స్ ఆధారంగా రూపొందించిన ఈ పాఠ్యాంశం విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షల పట్ల కూడా అవగాహన కల్పించడం జరుగుతుంది. జిల్లాలో ఎంపిక చేసినకోస్గి, మద్దూరు, గుండుమల్, కొత్తపల్లె మండలాల్లో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుందనీ,వేద గణితం ద్వారా త్వరిత గణన నైపుణ్యాల పెంపు,ప్రతి పాఠశాలలో ప్రత్యేక శిక్షణ తరగతులు,లెక్కలపై భయాన్ని తొలగించి విశ్వాసం పెంచడం,ప్రాథమిక గణిత మూలభూతాలను సులభ పద్ధతులతో నేర్పడం,విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యాల అభివృద్ధి,"చదువుల పండుగ" లో భాగంగా ప్రారంభమైన ఈ వేదిక్ మాథ్స్ ప్రోగ్రాం, నారాయణపేట విద్యార్థుల్లో లెక్కల వేగం, ఖచ్చితత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా కీలక పాత్ర పోషించనుందని ఏ ఎం ఓ విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ శ్రీ ప్రణయ్ కుమార్, సరోజినీ స్మార్ట్ లర్నింగ్ ప్రతినిధులు మురహరి దోసల, నిహారిక పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు రానివ్వద్దు..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన**

**షాద్ మున్సిపల్ కార్యాలయాన్ని ఆస్మసికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే శంకర్**

**మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రహదారుల పనులు వేగవంతం చేయాలి**

**మున్సిపల్ సిబ్బంది సమయపాలన పాటించాలి**

**ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కమిషనర్ కు ఆదేశం**







షాద్ నగర్ పట్టణంలో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు రానివ్వకుండా అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు చొరవ చూపుతూ చర్యలు చేపట్టాలని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్థానిక మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డికి సూచించారు. గురువారం షాద్ నగర్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో అధికారులు ఆయా విభాగాల సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అని రిజిస్టర్ పట్టికను పరిశీలించారు. అందరూ సమయపాలన కచ్చితంగా పాటించాలని ప్రజలకు ప్రభుత్వ పని సమయాల్లో అందుబాటులో ఉండాలని కమిషనర్ కు ఆదేశించారు. అనంతరం పనుల అభివృద్ధిపై అధికారులను పలు సమస్యలను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ముఖ్యంగా పట్టణంలో పారిశుద్ధ్య విప్లవం కోసం నూతనంగా చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని అదేవిధంగా ఇంకా చేపట్టాల్సిన పనుల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఉన్న సాంకేతిక లోపాలు ఉన్న తన దృష్టికి వెంటనే తీసుకురావాలని ఆదేశించారు. అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడాల్సిన అవసరం లేదని యుద్ధ ప్రాతిపదికను అభివృద్ధి పనులు చేపట్టాలని కమిషనర్ సునీత రెడ్డికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, నేతలు అగ్గనూర్ బస్వ%శీ%, చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, శ్రీనివాస్ యాదవ్, జమ్రుద్ ఖాన్, కృష్ణా రెడ్డి, దామోదర్ రెడ్డీ, మురళీ మోహన్ (అప్పి), యాదిగిరి యాదవ్, నలమోని శ్రీధర్, ముబారక్ అలీ ఖాన్, అర్జున్ లక్ష్మణ్, షఫీద్దిన్, మాధవులు యాదవ్, మనీష్, జగదీశ్వర్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## శేఖర్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

**రైల్వే శాఖ నుండి వెంటనే కేసును పోలీసులకు అప్పగించాలి**

**రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు రాజ్ గౌడ్**

**శంషాబాద్ డిసిపి రాజేష్ కు వినతిపత్రం సమర్పించిన బిజెపి నాయకులు**

**షాద్ నగర్ బిజెపి నేతలు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి హాజరు**

**న్యాయం కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందే శ్రీరాములు యాదవ్ తదితరుల రాక**





గ్రామపంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్త నామినేషన్ వేయడంతో అతని బెదిరింపులకు గురిచేసి అతడు చావుకు కారణమైన వారిపై వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) రాజేష్ ను షాద్ నగర్ బిజెపి సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి అదేవిధంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందే శ్రీరాములు యాదవ్ తదితరులు డీసీపీని ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా డిసిపికి భారతీయ జనతా పార్టీ తరఫున వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికల్లో స్వేచ్ఛ లేకుండా చేస్తూ బిజెపి కార్యకర్తలను కొందరు టార్గెట్ చేసి వారిని చావు వైపు వెళ్లేందుకు బలవంతం చేస్తున్నారని డిసిపి దృష్టికి తెచ్చారు. ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామానికి చెందిన ఆవ శేఖర్ గ్రామంలో నాలుగో వార్డు బిజెపి మద్దతుదారుడిగా నామినేషన్ వేశారని, అయితే గ్రామానికి చెందిన కొందరు ఇతర పార్టీ నాయకులు అతని బెదిరించి బ్లాక్మెయిల్ చేసి అతని చావుకు కారణం అయ్యారని డిసిపి దృష్టికి తెచ్చారు. ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించకుండా కొంతమంది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా ఎన్నికల్లో డబ్బు పలుకుబడి హోదా బెదిరింపులు ఆసరాగా చేసుకుని అమాయకులను టార్గెట్ చేస్తున్నారని పోలీసులు ఇలాంటి పరిస్థితులను గ్రహించి ఉక్కు పాదం మోపాలని వారు డిమాండ్ చేశారు. జరిగిన సంఘటన ఎంతో బాధాకరమైనదని శేఖర్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఎందుకుగాను రైల్వే పోలీసుల నుండి వెంటనే పోలీసులు స్పందించి కేసును స్థానిక పోలీసులకు అప్పజెప్పేలా చర్యలు తీసుకోవాలని డీసీపీకి సూచించారు. శేఖర్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని వారిని వెంటనే జైలుకు పంపాలని విచారణ పూర్తయ్య వరకు బెయిల్ రాకుండా చూడాలని అధికారికి సూచించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో నిందితులు పోరు దాటిపోకుండా వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని డిసిపిని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు వంశీకృష్ణ, నందకిషోర్ అంజన్ కుమార్ గౌడ్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## సిల్వర్ మోడల్ సాధించిన ఖో ఖో ఆనందిని







**విజేతలను ఆదర్శంగా తీసుకోవాలి**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 4( స్కై న్యూస్)** 44వ ఖో ఖో జూనియర్స్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో జిల్లాలోని తూడుకుర్తి గ్రామానికి చెందిన ఆనందిని సిల్వర్ మోడల్ సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. మూడు రోజులపాటు సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరువు లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో నల్గొండ జిల్లా పై విజయం సాధించి ఫైనల్ కు చేరుకున్న ఆమె ఆదిలాబాద్ జట్టుపై నిర్వహించిన క్రీడలలో రెండవ స్థానం సాధించి పథకాన్ని అందుకోవడం పట్ల ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బహుమతిని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో గెలుపు ఓటములను సహజంగా తీసుకొని విజయం సాధించేందుకు నిరంతరం శ్రమించాలని అన్నారు. ఖో ఖో క్రీడను ఇంటి పేరుగా మార్చుకున్న నందిని మరిన్ని క్రీడలలో రాణించి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఆమె ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు క్రీడలలో విద్యలో రాణించాలని అందుకు నిరంతరం కఠోరమైన దీక్షను చేయాలని కోరారు ఫిజికల్ డైరెక్టర్ విష్ణు ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి సఫియా సుల్తానా విమలాదేవి పద్మ రాధాకృష్ణమోహన్ ప్రసాద్ రమేష్ వెంకట్ రాజు స్వరూపా ఫిజికల్ డైరెక్టర్ సామా రమేష్ తదితరులు విద్యార్థిని అభినందించారు

## భార్యకు షాకింగ్ వీడియో పంపించిన భర్త

**షాద్ నగర్ లో ఘటన**

**మనీలా నన్ను క్షమించు..!**

**నేను చచ్చిపోతా.. పిల్లలు జాగ్రత్త**

**భార్యకు వీడియో పంపించి స్విచ్ ఆఫ్ చేసిన భర్త**

**ఆందోళన రేకెత్తిస్తున్న సుందర చారి వీడియో**

**ఆందోళనలో కుటుంబ సభ్యులు**

మనీలా నన్ను క్షమించు నాకు ఏ పని చేయబుద్ధి కావడం లేదు నేను చచ్చిపోతున్న పిల్లలను జాగ్రత్తగా చూసుకో అంటూ ఓ భర్త భార్యకు వీడియో మెసేజ్ పెట్టి ఆ తర్వాత స్విచ్ ఆఫ్ చేశాడు. భర్త ఆచూకీ తెలియక భార్య ఏం జరిగిందో అని తెలియక విలవిలలాడుతుంది. నిన్న ఇంటి నుండి పనికి వెళ్తానని చెప్పి వెళ్లిన భర్త ఆ తర్వాత భార్యకు షాకింగ్ వీడియో పంపించాడు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సుందరా చారి నిన్న బుధవారం ఇంటి నుండి పనికి వెళు_న్నానని చెప్పి ఉదయం 8గంటల 30 నిమిషాలకు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12: 20 గంటలకు భార్య మనీలకు ఫోన్ చేసి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లుగా ఓ వీడియో సందేశాన్ని పంపించాడు. తనకు ఏ పని చేసే బుద్ధి కావడం లేదని తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తనను క్షమించాలని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఆ వీడియోలోని సారాంశం. తన చావుపట్ల ఎవరు ఏ అపార్థం చేసుకోకూడదని తన చావు తర్వాత తన భార్య బిడ్డలను కూడా ఏమనకూడదని అదేవిధంగా తన అప్పులకు సంబంధించి తనను క్షమించాలని ఇబ్బంది పెట్టొద్దని రాఘవేంద్ర చారి వీడియో ద్వారా సందేశం పంపించి ఆ తర్వాత స్విచ్ ఆఫ్ చేశాడు. రాఘవేంద్ర చారి వీడియోలు ఓ చెరువు కనిపిస్తుంది. ముళ్ళ పొదలతో నిండి ఉన్న ఆ చెరువు ఎక్కడ ఏమిటి అనేది ఇంకా సమాచారం తెలియ రావడం లేదు. భార్య మనీలా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. తన భర్త ఆచూకీ తెలిపేందుకు సహకరించాలని ఎక్కడైనా రాఘవేంద్ర చారి కి సంబంధించిన ఆచూకీ తెలిస్తే పోలీసులకు తెలుపాలని ఆమె పేర్కొంది. పోలీసులు వెంటనే స్పందిస్తే తన భర్త తనకు దొరుకుతాడని తనకు న్యాయం చేయాలని మనీలా కోరుకుంటుంది..

## అయ్యవారిపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**అయ్యవారిపల్లి సర్పంచ్ జి. గోపాల్ రెడ్డి**

**అయ్యవారిపల్లి సర్పంచ్ గా నియామక పత్రం అందజేసిన అధికారి నిశాంత్ కుమార్**



అయ్యవారిపల్లి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా చూస్తానని ఫరూక్ నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామ నూతన సర్పంచిగా ఎన్నికైన గోటిక గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం భీమారం క్లస్టర్ ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ చేతుల మీదుగా సర్పంచ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంతో నమ్మకంతో గ్రామ పెద్దలు ప్రజలు తన మిత్ర బృందం సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయ్యే విధంగా కృషి చేశారని వారికి సర్వదా రుణపడి ఉంటాను అని గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. అయ్యవారిపల్లి గ్రామం పై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులు పుష్కలంగా ఉండేవిధంగా ఆయన భరోసా ఇచ్చారని ఆయన సూచన సలహాల మేరకు గ్రామాన్ని సర్వతో ముఖాభివృద్ధిగా తీర్చిదిద్దుతానని అన్నారు. ముఖ్యంగా సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయిన సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా కూ

# వైభవంగా దత్తాత్రేయ జయంతి...

**దత్తాత్రేయని పూజిస్తే గురుబలం సిద్ధిస్తుంది.**
**భక్తి శ్రద్ధలతోసామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు.**
**రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్.**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 4( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో మార్గశిర మాసం పౌర్ణమి నాడు శ్రీ దత్తాత్రేయ జయంతి సందర్భంగా గురువారం నాడు దత్తాత్రేయ స్వామి వారికి విశేష ద్రవ్య పంచామృత అభిషేక పూజలు, హెూమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు.వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులచే దత్తాత్రేయ స్వామి వారికి వేదమంత్రోచరణాల మధ్య అభిషేక హెూమ పూజలు వైభవంగా జరిగాయి. పౌర్ణమి సందర్భంగా ప్రతినెల నిర్వహించే శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు 12మంది దంపతులతో సామూహికంగా భక్తులచే శాస్త్రోక్తంగానిర్వహించారు.ఈ వ్రతాలు చేయడంతో భక్తులకు కోరిన కోరికలు మరియు వారికి దారిద్ర్యం తొలగి,అష్ట ఐశ్వర్యాలు సిరి సంపదలు సిద్ధస్తాయని,విశేషంగా పుణ్య ఫలితం భక్తులకు అందుతుందనీ అన్నారు.ఆలయంలో ప్రతి నెల పౌర్ణమి రోజు వ్రతాలు నిర్వహిస్తున్నారని,విశేష అభిషేకం,శివభిషేకపూజలు నిర్వహించారు.భగవంతుని అనుగ్రహం సూక్ష్మ మార్గంలో పొందుటకు,దోష నివారణ జరుగుటకు తమకు తోచిన విధంగా తమ శక్త్యానుసారం , పూజలు,వ్రతాలు నిర్వహించడంతో భగవంతుని ప్రసన్నం చేసుకొని వారి ఆపదలు తొలగి,కోరికలు నెరవేర్చే విధంగా స్వామి అనుగ్రహిస్తాడనీ ఆయన తెలిపారు.ఆలయ ఆవరణలోని శివాలయంలో పరమశివుని భక్తులు దర్శించుకున్నారు. రామాలయ అన్నప్రసాద కమిటీ వారికి సామూహికంగా అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.నిత్య విష్ణుసహస్రనామ పారాయణ కమిటీ సభ్యులు,సాయి భక్తులు స్వామి వారిని కీర్తిస్తూ కీర్తనలు భజనలు చేశారు.భక్తులకు వేద ఆశీర్వచనం,తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.రామాలయ అన్నప్రసాద కమిటీ వారిచే ఏర్పాటు చేసిన సామూహిక



భోజనాలలో 525మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు చక్రవర్తి శ్రీనివాస చార్యులు, కందాడై శ్రీనివాసచార్యులు, అన్న ప్రసాద కమిటీ సభ్యులు కందడై జయలక్ష్మి, కరుణశ్రీ ,అర్థం రవీందర్,టి.మల్లేష్, గొల్ల రాములు,రమాదేవి, రత్నమాల,శారద, నారాయణ, శివ, పుల్లయ్య,బాలస్వామి, చారి,నరసింహ గౌడ్, సాయిభక్తులు,నిత్య విష్ణు సహస్ర పారాయణం కమిటీ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడి ప్రమాణాస్వీకారంలో పార్టీ అనుబంధ విభాగాల కార్యకర్తలు పాల్గొనాలి



**- కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు**

**మహబూబ్ నగర్, డిసెంబర్ 04(స్కైన్యూస్)** శుక్రవారం జరిగే నూతన డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ చైర్మన్ సాయిబాబా, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, జిల్లా యువజన అధ్యక్షులు అవేజ్ అహ్మద్. మైనార్టీసెల్ అధ్యక్షులు ఎండి. ఫయాజ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంజీవ్ ముదిరాజ్ ఇంటి నుంచి భారీస్థాయిలో ర్యాలీ పార్టీ కార్యాలయం వరకు ఉంటుందని, అనంతరం కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుబంధ విభాగాల శ్రేణులు పాల్గొనాలని వారు కోరారు. సమావేశంలో పార్టీ ఎస్టీసెల్ నాయకుడు కిషన్ నాయక్, నాయకులు ఆక్చర్ వెంకటేశ్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ గా జి. గోపాల్ రెడ్డి

**షాద్ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తొలిబోణీ**
**సర్పంచ్ పదవి కోసం ఐదుగురు నామినేషన్**
**నామినేషన్ ఉపసంహరించుకున్న పలువురు నాయకులు**
**ఫోన్లో అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామం సర్పంచ్ గా కాంగ్రెస్ యువ నాయకుడు గోటిక గోపాల్ రెడ్డి ఏక గ్రీవంగా ఎంపికయ్యారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ వేసిన గోపాల్ రెడ్డితో పాటు మరో ఐదు మంది నామినేషన్ వేశారు. మిగతా నాయకులు నామినేషన్ ఉపసంహరించుకోగా బరిలో గోపాల్ రెడ్డి ఒక్కరు నిలిచారు. అయ్యవారిపల్లి సర్పంచ్ గా నామినేషన్ వేసిన వారిని విజేందర్ రెడ్డి, యాదయ్య, వెంకట్ రెడ్డి, పులుసు మామిడి రమేష్ తదితరులు నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా మిగతా నలుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక బరిలో గోపాల్ రెడ్డి మాత్రమే ఉన్నారు. అధికారులు ఇక లాంచనంగా ప్రకటించడమే తరువాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఫోన్లో గోపాల్ రెడ్డికి అభినందనలు, ఆశీస్సులు తెలిపారు. ఘనమైన స్థాయిలో మంచి సేవా కార్యక్రమాలతో ప్రజలను ఆదరించాలని రాజకీయాలు కచ్చితంగా సహకరించినందుకు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు ఏకతాటిపైకి రావడం పోటీ లేకుండా తిరద్వీపం చేయడం లాంటి మంచి ఉద్దేశంతో ముందుకు సాగడం ఐకమత్యానికి నిదర్శనం అని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డికి సీనియర్ జర్నలిస్టు కేపీ కూడా శుభాకాంక్షలు స్వయంగా తెలియజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన నాయకుడు అంజన్ రెడ్డి తదితరులు సంతోషంతో ఆనందభాష్పాలు తెలియజేశారు..

# క్రికెట్ లో "యశ్వంత్ రాజ్ కోట" వెలగాలి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**తెలంగాణ స్టేట్ మీట్ కు ఎంపికైన విద్యార్థికి సన్మానం**



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ అండర్ 14 విభాగంలో ఫేస్ బౌలింగ్ కోసం ఎంపికైన షాద్ నగర్ విద్యార్థిని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన నారాయణ స్కూల్ విద్యార్థి యశ్వంత్ రాజ్కోట స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ అండర్ 14 విభాగంలో ఫేస్ బౌలర్ గా ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థి యశ్వంత్ రాజ్ కోటను ఎమ్మెల్యే స్వయంగా శాలువాతో సత్కరించి అభినందించారు. క్రికెట్ క్రీడలు బాగా రాణించి ఈ ప్రాంతం పేరును దశ దిశల వ్యాపించేలా చేయాలని ముఖ్యంగా బాగా ఆడి ప్రత్యేక హెూదా రాణించి భారత జట్టులో కూడా భవిష్యత్తులో స్థానం సంపాదించాలని ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ ఆశించారు. ఆర్టిఏ ఏజెంట్ గా పనిచేస్తున్న పట్టణానికి చెందిన విజయ్ కోట కుమారుడు యశ్వంత్ రాజ్ కోట. ఈ విద్యార్థిని పలువురు నాయకులు కూడా ఎంతో అభిమానంతో సత్కరించారు..

# కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించన్న ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్...

**ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి , తమిళనాడు మాజీ గవర్నర్ శ్రీ కొణిజేటి రోశయ్య వర్ధంతి**

షాద్ నగర్ పట్టణంలో వాసవి కనక పరమేశ్వరి దేవాలయం ఆవరణ లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ,పాల్గొన్న వారు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కో%శీ%కళ్ళ చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం , ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మల్లిపెద్ది శ్రీనివాస్ ,గౌరవ అధ్యక్షుడు పెద్ది రాం మోహన్,మాజీ అధ్యక్షుడు సరాపు రమేష్ కుమార్,, ,నేతలు అగ్గనూర్ బస్వ%శీ%, చెంది



తిరుపతి రెడ్డి,మహ్మద్ ఇబ్రహీం, శ్రీనివాస్ యాదవ్,జ్యమద్ ఖాన్,కృష్ణా రెడ్డి, దామోదర్ రెడ్డీస్ మురళీమోహన్(అప్పి), యాదిగిరి యాదవ్, నల్లమోని శ్రీధర్,ముబారక్ అలీ ఖాన్, అర్జున్ లక్ష్మణ్,షఫీద్దిన్,మాధవలు యాదవ్ జగదీశ్వర్,పోల శశి దర్, యంసాని శ్రీనివాస్, బండారు ఆనంద్, మాణిక్యం,రాం మోహన్, దండు శంకర్, సూర్య నారాయణ , నాగరాజు,తదితరులు పాల్గొన్నారు..

## పట్టణ జామియా మజీద్ నూతన కమిటీ అధ్యక్షులుగా ఆయుబ్ ఖన్

**దేవరకద్ర, అమరచింత డిసెంబర్ 4 (స్కై న్యూస్):** అమరచింత పట్టణంలో గురువారం జామియా మజీద్ లో జరిగిన ముస్లిం పట్టణ మైనార్టీ కమిటీ సమావేశంలో నూతనంగా పట్టణ జామియా మజీద్ అధ్యక్షులుగా అయూబ్ ఖాన్ నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మసీద్ కమిటీ పెద్దలు తెలిపారు. అయుబ్



ఖాన్నీ మత పెద్దలు ఘనంగా శాలువాలతో సన్మానించారు.ఈ సమావేశంలో మసీద్ కమిటీ పెద్దలు ఇస్మాయిల్, ఫరీద్, ఏ బి నిస్సార్,ఇక్బాల్, మైనద్దీన్, షబ్బీర్, ఫయాజ్ నిస్సార్ సోనీ అక్బర్, ఖాజా హుస్సేన్,రఫీ, సోనీ అక్బర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య పర్యవేక్షణతో సమీక్ష సమావేశం

**కొత్తగూడెం డిసెంబర్ 4 (స్కై న్యూస్):** ఐ డి ఒ సి కార్యాలయంలో జిల్లాలోని వైద్య ఆరోగ్య పర్యవేక్షకులతో సమీక్ష సమావేశంను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూఎన్సీడీ ఆన్లైన్ హెచ్ఐ ఎం ఎస్ ఆన్లైన్ తదితర అన్ని ఆన్లైన్ ప్రోగ్రామ్లను క్రమం తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లాలో జరుగుతున్న కన్నులు, క్షయవ్యాధి నియంత్రణ, కుష్ఠ వ్యాధి కార్యక్రమాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీఎచ్సీ వారీగా సమీక్షించారు.ప్రతి పిఎచ్సీ స్థాయిలో సమీక్ష సమావేశాలను నెలలో రెండు సార్లు నిర్వహించాలని సూచించారు.ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల తర్వాత సమీక్ష సమావేశ నిర్వహించాలని, ఉదయం ఓపి సేవలను పూర్తిగా నిర్వహించాల్సిందిగా తెలియజేశారు.ప్రతి నెల మూడవ



వారంలో శ్రమదానం ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పనికిరాని వస్తువులను ముగ్గురు సభ్యుల కమిటీ ద్వారా పరిశీలించి తొలగించాలని సూచించారు.స్కూళ్లు కాలేజీలలో వైద్య శిబిరాలు నిర్వహించి, వాటికి సంబంధించిన రిపోర్టులను సమయానికి పంపించాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ మాత-శిశు సురక్ష కార్యక్రమాలు,కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు పై సమీక్షించారు.ఐడీఎస్పీ ప్రోగ్రామ్ ఆఫీసర్ పుల్లారెడ్డి మాట్లాడుతూ,అన్ని వివరాలను సకాలంలో నమోదు చేయాలని, క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి తగిన చికిత్స అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, డిప్యూటీ డీఎం హెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి, ఐడీఎస్పీ ప్రోగ్రామ్ ఆఫీసర్ పుల్లారెడ్డి, ఇమ్యూనైజేషన్ అధికారి నాగభూషణం పాల్గొన్నారు.

## రైల్వే గోడౌన్ వద్ద కృష్ణారెడ్డి నిర్వహించిన ప్రత్యేక పూజ లో ఎమ్మెల్యే జి ఎం ఆర్

**దేవరకద్ర కౌకుంట్ల డిసెంబర్ 4 (స్కై న్యూస్):**కౌకుంట్ల మండల కేంద్రంలోని రైల్వే గోడౌన్ వద్ద కృష్ణా రెడ్డి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో గురువారం ముఖ్య అతిథులుగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని స్వామికి ప్రత్యేక మొక్కలు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేను కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## దశదిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**చిన్న చింతకుంట డిసెంబర్ 4 (స్కై న్యూస్):** చిన్నచింతకుంట మండలం దమగ్నపూర్ గ్రామంలో సత్యనారాయణ రెడ్డి అమ్మగారు ఇటీవలే చనిపోయిన సందర్భంగా గురువారం దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలర్పించిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# రిజర్వేషన్ల వివరాలు సరిచూసుకొని నామినేషన్లు స్వీకరించాలి....

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 4 (స్కై న్యూస్):**గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఆయా పంచాయతీలకు ఖరారు చేసిన రిజర్వేషన్లను సరిచూసుకొని పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ బెటాలియన్ లో ఉన్న జెడ్పిహెచ్ఎస్ భవనంలో క్లస్టర్1, క్లస్టర్2 నామినేషన్లను స్వీకరించు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఇక్కడ ఎర్రవల్లి తో పాటు సాసనోలు, ఆర్. గార్లపాడు తిమ్మాపూర్, షేక్ పల్లె, బీచుపల్లి, జింకలపల్లి, కొండేరు, బి. వీరాపూర్ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను కూడా స్వీకరిస్తుండడంతో ఆయా పంచాయతీల ఓటర్ లిస్టును పరిశీలించారు. పోటీ చేయు అభ్యర్థులు పూరించాల్సిన వివిధ దరఖాస్తులను, నామినేషన్ వేసేందుకు అవసరమైన ఇతర సామాగ్రిని రిటర్నింగ్ అధికారులు సిద్ధంగా ఉంచుకోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే వారికి తగిన సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందికి సూచించారు. సర్పంచు, వార్డు సభ్యులు పదవులకు పోటీ చేయు అభ్యర్థులు తమ దరఖాస్తుకు జతపరచాల్సిన వయసు, కుల, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాలనీ



రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పోటీ చేయు అభ్యర్థులు గ్రామ పంచాయితీకి చెల్లించాల్సిన పన్నులు పెండింగ్లో ఉండకుండా కట్టించుకోవాలన్నారు. నామినేషన్ల డిపాజిట్ స్వీకరించాక అభ్యర్థులకు రసీదును అందజేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పత్రాలను విధిగా నామినేషన్ వేసిన వారికి అందజేయాలన్నారు. నామినేషన్ వేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు టీ-పోల్ యాప్ లో నమోదు చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటల లోగా నామినేషన్ కేంద్రం లోపల ఉన్న వారి నుంచి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, నిర్దేశిత సమయం మించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో కేంద్రంలోకి అనుమతించరాదన్నారు. ఈ పర్యటనలో ఎర్రవల్లి మండల తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్, తదితరులున్నారు.

# మరుజన్మ రహిత కు అచల మార్గం

**-శ్రీ గురు దర్శనానంద విజయార్యులు**

**ఉట్కూర్, సెప్టెంబర్ 07 (స్మైన్యూస్ ):**మానవుడు మళ్లి మళ్లి జన్మ ఎత్తకుండా మార్గం చూపేది అచల మార్గమని శ్రీ గురు దర్శనానంద విజయార్యులు అన్నారు. దత్త జయంతి సందర్భంగా గురువారం ఉట్కూర్ దగ్గర ఉన్న శ్రీదత్త త్రిలింగేశ్వర స్వామి దేవాలయం (శ్రీలింగాపురం)లో ఆలయ ధర్మకర్తలు పద్మ ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో ఉన్న శ్రీ దత్తాత్రేయ మందిరంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రక్కనే ఉన్న శ్రీ అచలగురు మందిరంలో శ్రీ గురుచరణంద దత్తయ్య రాజయోగి భక్త బృందం ఆయన పాదుక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ గురు దర్శనానంద విజయార్యులు. భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ అచల మార్గం అంటే వ్యక్తి ఆరాధన అంటున్న వారున్నారని, అచల ఉపదేశం పొందిన వారు అలాంటివి






పట్టించుకోరాదని అన్నారు. ప్రతి ఒక్కరు దైవ భక్తి పెంపొందిచుకోవాలని, ఆ భక్తి పండితే మోక్షం గురించి ఆలోచన వస్తుందని అన్నారు. అప్పుడు అచల గురువు ఉపదేశం అవసరం అవుతుందని ఆయన అన్నారు. భగవతి ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమం లో అచల గురువులు అప్పిరెడ్డి పల్లి మాణిక్యమ్మ, హన్మంతు ,వెంకట్ నారాయణ, సాయిలు, ఉట్కుర్ మండల మత్స్య సహకార సంఘం మహిళ అధ్యకషురాలు సరోజ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె శివరామరాజు పాటు అధిక సంఖ్య లో భక్తులు పూజలో పాల్గొన్నారు. అయ్యారు.

# అజరామరం ఆ గానం


భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు. తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు.




1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1944 మార్చి 4న తమ మేనకోడలు సావిత్రిని పరిణయమాడారు. తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రులైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు. సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. "స్వర్గసీమ" చిత్రంలో తొలిసారి నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు అవకాశం ఇవ్వగా, భానుమతితో పాడిన పాటకు 118 రూపాయల పారితోషికం పొందారు. భానుమతి రామకృష్ణలు తీసిన రత్నమాల చిత్ర సహాయ సంగీత దర్శకత్వ అవకాశం పొంది, తర్వాత బాలరాజు, మనదేశం లకు సంగీత దర్శకులైనారు. 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఘన విజయం ఘంటసాలకు ఎనలేని పేరు తెచ్చి పెట్టింది. మల్లీశ్వరి తర్వాత 1953లో దేవదాసు, 55లో అనార్కలి, 57లో మాయాబజార్ లాంటి హిట్ సినిమాలు ఘంటసాలను సాటిలేని మేటి గాయకునిగా నిలబెట్టాయి. 1970 వరకూ హీరో లకు, విలన్లకు, కమేడియర్లకు పాడిన ప్రతి పాటా మాస్టరుదే కావడంతో ఆయన సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కా రం గ్రహించారు. 71లో ఐరోపా, అమెరికాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్యం క్రమేపీ క్షీణించి చివరకు 1974 ఫిబ్రవరి 11న యావదాంధ్ర సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచి, స్వర్గస్తులైనారు. కరుణశ్రీ, జాషువా, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి ప్రశంసలకు పాత్రులై, వారి రచనలను వీధి పాటలుగా, నూతన ఒరవడితో శైలితో పద్యాలుగా, సామాన్య జన బాహుళ్యానికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మాస్టారుదే. సాంప్రదాయ సంగీతానికి భంగం వాటిల్ల నీయకుండా, సామాన్య సంగీత ప్రియులకు సైతం హృదయ రంజకంగా పాడిన "శేషశైలావాసా", "ఏడు కొండ స్వామి", రహస్యం, లవకుశ, నర్తనశాల, ఒకటేమిటి పాడిన పాటలెన్నో పండిత పామర ప్రశంసాపాత్రాలైనాయి. జన్మతః లభ్యమైన సుమధుర గంభీర గాత్రంతో గానం చేసిన "భగవద్గీత అజరామర సుస్వరాన్ని కలిగిన ఘంటసాలను అనునిత్యం స్మరణీయునిగా చేస్తూనే ఉంది.

# ప్రతిభావంతుడైన దౌత్యవేత్త మాజీ ప్రధాని గుజ్రాల్

ఇందర్ కుమార్ గుజ్రాల్ భారతదేశ రాజకీయ రంగంలో తన శాంతియుత దృక్పథం, దౌత్య చాతుర్యం, పరిసర దేశాలతో సత్సంబంధాలను నెలకొల్పడంలో ప్రత్యేకమైన ఘనత సాధించిన నేత. 1997 నుండి 1998 వరకు భారతదేశ 12వ ప్రధాన మంత్రిగా పనిచేసిన ఆయన, తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహించారు. "గుజ్రాల్ సిద్ధాంతం" అనే తన ప్రత్యేక దౌత్య విధానంతో దక్షిణాసియా దేశాల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం, మరియు సహకారం పెంపొందించే ప్రయత్నం చేశారు. ఇందర్ కుమార్ గుజ్రాల్ 1919 డిసెంబర్ 4న, అప్పటి అవిభజిత పంజాబ్ లోని జీలం (ప్రస్తుత పాకిస్తాన్)లో ఒక దేశభక్తుల కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. చిన్ననాటి నుంచే గుజ్రాల్‌లో దేశభక్తి భావం కలిగింది. విద్యాభ్యాసం కోసం లాహోర్ ఫోర్మాన్ క్రిస్టియన్ కాలేజీలో చేరి, ఆ తర్వాత పంజాబ్ యూనివర్శిటీలో పట్టభద్రుడయ్యారు. విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి, 1942లో మహాత్మా గాంధీ నేతృత్వంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ కారణంగా ఆయన కొన్ని నెలలు జైలు శిక్ష అనుభవించారు. గుజ్రాల్ రాజకీయ జీవితం 1950లలో ప్రారంభమైంది. 1964లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సమాచార మరియు ప్రసార మంత్రిగా పనిచేసినప్పుడు, ప్రత్యేకించి 1971 పాకిస్తాన్-భారత్ యుద్ధ సమయంలో, దేశానికి మార్గదర్శ కత్వం వహించారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీతో విభేదించి, జనతా పార్టీలో చేరారు. 1989లో గుజ్రాల్ విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పదవిలో ఉన్నప్పుడు, ఆయన భారతదేశం - సోవియెట్ సం బంధాల ను మరింత బలపరిచారు. అలాగే, పాకిస్తాన్‌తోనూ శాంతి యుత సంబంధాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. 1997లో దేవగౌడ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూలిపోవడంతో, గుజ్రాల్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీక రించారు. ఆయన ప్రధానమంత్రి పదవిలో ఉన్న సమయంలో, భారతదేశం ఆర్థిక సమస్యలతో పాటు, రాజకీయ అస్థిరతను కూడా ఎదుర్కొంది. అయినప్పటికీ, ఆయన శాంతి, సహకారంపై దృష్టి సారించి, పొరుగు



దేశాలతో సత్సంబంధాలను మెరుగు పరిచేందుకు కృషి చేశారు. గుజ్రాల్ సిద్ధాంతం అనే దౌత్య విధానం గుజ్రాల్ సిద్ధాంతంలో కేంద్రంగా ఉంది. ఇది ముఖ్యంగా భారతదేశం తన పొరుగు దేశాలతో శాంతి మరియు సౌభ్రాతృత్వాన్ని ఎలా మెరుగుపరచు కోవాలో చూపించే ఆచరణాత్మక దృక్పథం. ఈ సిద్ధాంతం ఐదు ముఖ్య సూత్రాలపై ఆధారపడి ఉంది: 1.భారతదేశం ఎప్పుడూ ఇతర దేశాలకు నష్టపరిచే విధంగా వ్యవహరించరాదు. 2. పొరుగు దేశాల సహకారం కోసం ఇండియా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా కొన్ని రాయితీలు ఇవ్వాలి. 3. ఏ సమస్యలైనా శాంతియుతంగా పరిష్కరించుకోవడం ముఖ్యలక్ష్యం. 4. ఏ ఇతర దేశం వ్యతిరేకంగా జట్టు కట్టకుండా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం. 5.దక్షిణాసియా ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించేందుకు సహకారం అందించడం గుజ్రాల్ అత్యంత ప్రతిభావంతమైన దౌత్యవేత్త. ఆయన విదేశాంగ శాఖలో చేసిన కృషి అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు పొందింది. గుజ్రాల్ ప్రధాన ఉద్దేశ్యం భారతదేశం పొరుగు దేశాలతో శాంతి పరమైన సంబంధాలు కొనసాగించడం. కాశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేశారు. రాజకీయాలకు ఆపాదమానస్కుడిగా ఉంటూ, సామాజిక సేవలో కూడా తన సంతకం వేశారు. ఇందర్ కుమార్ గుజ్రాల్ 2012లో 92 సంవత్సరాల వయసులో మరణించారు. తన ఆత్మకథ 'మీఫ్వతీం శీట ణఱంఎతీవ్ఱశీఅ' ద్వారా ఆయన జీవితం, అనుభవాలను పంచుకున్నారు. ఆయన గడిచిన కాలం శాంతి, సౌభ్రాతృత్వం మరియు సహకారం కోసం గుర్తుండి పోతుంది. ఆయన ప్రతిష్టించిన గుజ్రాల్ సిద్ధాంతం భారతదేశం యొక్క విదేశాంగ విధానానికి ఇప్పటికీ మార్గదర్శిగా ఉంది. ఇందర్ కుమార్ గుజ్రాల్ భారతదేశ రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేశారు. దౌత్యకళ, శాంతి పరమైన సంబంధాలపై నమ్మకం, పొరుగు దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్ప డంలో చేసిన కృషి భారతీయ ప్రజలకు స్ఫూర్తిదాయకం. గుజ్రాల్ సిద్ధాంతం వంటి సిద్ధాంతాలు, భారతదేశం యొక్క భవిష్యత్ దౌత్య విధానానికి పునాది వేసిన పాఠాలు.

## తొలి విడత సర్పంచ్ ఎన్నికలు..
## నేడు తుది సమరం షురూ ! .......

**ఉపసంహరణ గడువు బుధవారం నాటితో పూర్తి....**

**డిసెంబర్ 11న తొలి విడుత పోలింగ్, అదే రోజు ఫలితాలు...**

**రాజన్న సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల, ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 3 నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో, ఎన్నికల బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. నామినేషన్ల పరిశీలన, అప్పీళ్ల ప్రక్రియ అనంతరం నేడు ఉపసంహరణతో ఎన్నికల చిత్రణ పూర్తిగా స్పష్టం కానుంది.. మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న 5 మండలాల పరిధిలోని 85 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలు 748 వార్డ్ సభ్యుల కోసం ఆశావహులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే, నామినేషన్ల పరిశీలనలో కొన్ని పత్రాలు తిరస్కరణకు గురికావడం, మరికొందరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో, సాయంత్రం 3గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా వివరాలను రిటర్నింగ్ అధికారులు (ఆర్.ఓ.) ప్రకటించనున్నారు. పలు గ్రామాల్లో ముఖ్య పార్టీల మద్దతుదారులు బరిలో ఉండగా, కొన్ని చోట్ల స్వతంత్ర అభ్యర్థులు కూడా బలమైన పోటీని ఇస్తున్నారు. ఉపసంహరణ తర్వాత పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీల వివరాలను కూడా అధికారులు వెల్లడించే అవకాశం ఉంది. తొలి విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 11, గురువారం పోలింగ్ జరగనుంది. పోలింగ్ సమయం: ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్దే ఓట్లులెక్కించి, వెంటనే ఫలితాలను. ప్రకటించనున్నారు ఫలితాల వెల్లడి అనంతరం గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు పోలింగ్ నిర్వహణకు సంబంధించి ఎన్నికల అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ రోజు తుది జాబితాప్రకటనతో ప్రచారం మరింత వేడెక్కనుంది పోటీలో నిలిచిన అభ్యర్థులు తమ గెలుపు కోసం తదుపరి వ్యూహాలను రూపొందించుకోవడంలో నిమగ్నమయ్యారు.

## సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో
## దివ్యాంగుల దినోత్సవం.



**జగిత్యాల :** వైకల్యం దేనికైనా అడ్డు రాదని నిరూపించే ఆదర్శనీయులు దివ్యంగులని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ దివ్యంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 12 మంది వృద్ధ దివ్యంగులను హరి అశోక్ కుమార్ సన్మానించారు. అనంతరం అయన మాట్లాడుతూ ర్యాంపులు వారు నడువడానికి కాదు వారికి గౌరవం కోసం నిర్మించాలన్నారు. వారు సమాజానికి ఒక ఆస్తి అంటూ వారిలో ప్రతిభ ను కనుగొనడానికి మనకు మంచి సంకల్పం కావాల న్నారు . దివ్యంగుల ఆనందం మన ఆనందంగా భావించే రోజు వచ్చి నప్పుడే అదే నిజమైన దివ్యంగుల దినోత్సవమని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వ నాథం, కోశాధికారి వెల్ముల ప్రక్షాస్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, వివిధ సంఘాల ప్రతి నిధులు పూసాల అశోక్ రావు,, ఎం.డి. యాకుబ్, కట్ట గంగాధర్, పబ్బా శివానందం, బి. రాజేశ్వర్,ఓజ్జల బుచ్చి రెడ్డి, బొబ్బటి కరుణ, రాధ, గంగనీ జలజ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన
## రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ

**జగిత్యాల :** జిల్లాలో రెండవ విడత 7 మండలాల్లో 144 గ్రామ పంచాయతీ ఎన్నికలకు 1276 వార్డు స్థానాలకు చివరి రోజు సర్పంచ్ స్థానాలకు 941, వార్డు మెంబర్ స్థానాలకు 2927 నామినేషన్ లు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ తెలిపారు. కాగాసర్పంచ్ స్థానాలకు బీర్పూర్ 85,జగిత్యాల 37,జగిత్యాల రూరల్ 179,కొడిమ్యాల 165,మల్యాల 151,రాయికల్ 205సారంగాపూర్ 119 అలాగే వార్డు మెంబర్ స్థానాలకుబీర్పూర్ 275జగిత్యాల 117జగిత్యాల రూరల్ 550కొడిమ్యాల 509మల్యాల 526రాయికల్ 598సారంగాపూర్ 352 నామినేషన్ లు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## దివ్యాంగ విద్యార్థులను ఆదరించండి
## జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము




**జగిత్యాల :** దివ్యాంగ విద్యార్థులను ఆదరించాలని వారందరిని దేవుడిచ్చిన ప్రసాదంగా భావించాలే తప్ప భారంగా భావించరాదని జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము అన్నారు. స్థానిక భవితా కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బహుమతుల ప్రధానోత్సవకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి.ఈ. వో హాజరయ్యారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహించి శారీరక మానసిక ఎదుగుదలకు తోడ్పడాలని వారన్నారు. పి.ఆర్.టి.యు.టి.ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు మాట్లాడుతూ దివ్యాంగులు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సాంస్కృతి విభాగాల్లో ఎదగాలన్నారు. దివ్యాంగుల దినోత్సవం ముఖ్య ఉద్దేశము దివ్యాంగులను గౌరవించి వారి అవసరాలను తీర్చి సమాన హక్కులు కల్పించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు చేయాలన్నారు. ఈసందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఐ.ఆర్.ఈ.పిలు రాజేందర్, రాజబాబు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఉదయం బ్రేక్ ఫాస్ట్ మానేస్తే?



ఆరోగ్యకరమైన జీవితానికి ఉదయం తీసుకునే అల్పాహారం అత్యంత ముఖ్యమైనది. మీ ఆరోగ్యం ఉదయం పూట అల్పాహారంగా ఏమి తింటారనేదానిపై ఆధారపడి ఉంటుంది. చాలా మంది ఉదయం తొందరలో బ్రేక్ ఫాస్ట్ తీసుకోకుండానే హడావిడిగా వెళ్లిపోతుంటారు. ఆరోగ్యకరమైన జీవితానికి ఉదయం తీసుకునే అల్పాహారం అత్యంత ముఖ్యమైనది. మీ ఆరోగ్యం ఉదయం పూట అల్పాహారంగా ఏమి తింటారనేదానిపై ఆధారపడి ఉంటుంది. చాలా మంది ఉదయం తొందరలో బ్రేక్ ఫాస్ట్ తీసుకోకుండానే హడావిడిగా వెళ్లిపోతుంటారు. ఈ అలవాటు ఆరోగ్యానికి ప్రమాదకరం. ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ దాటవేసే అలవాటు క్రమంగా జీవక్రియ సిండ్రోమ్‌కు దారితీస్తుంది. దీంతో బొడ్డు కొవ్వు, అధిక రక్తపోటు, అధిక చక్కెర, చెడు కొలెస్ట్రాల్ ఒకేసారి పెరుగుతాయి. నిజానికి, ఈ అలవాటు ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. కాబట్టి ఉదయం అల్పాహారం తీసుకోకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లకండి. ఏది ఏమైనా అల్పాహారం తీసుకోవడం అవసరం. కొంతమందికి బ్రేక్ ఫాస్ట్ తీసుకోకుండా ఇంటి నుండి బయటకు వెళ్లిపోతారు. ఆ తర్వాత బయట రోడ్డు పక్కన దొరికే ఏదైనా చిరుతిళ్లు తినడం అలవాటు. అయితే, ప్రతిరోజూ ఇలా బయట తినడం ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్రేక్ ఫాస్ట్‌గా ఉదయం తీసుకునే ఆహారం రోజు మొత్తం మీ శక్తిని నిర్ణయిస్తుంది. అందుకే ఉదయం పూట ఆరోగ్య కరమైన ఆహారాలు మీ బ్రేక్ ఫాస్ట్‌లో ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే ఇది మీకు రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడుతుంది. అలాగే ఉదయం అల్పాహారంలో జ్యూస్ కూడా తీసుకోవచ్చు.

# ఇంత అందమైన పండు.. లాభాలు తెలిస్తే షాక్ అవుతారు



స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తితో పాటుగా పాటు కళ్ళను కూడా సంరక్షిస్తుంది. కంటి చూపు మెరుగు పడటానికి సహాయం చేస్తుంది. ఈ పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా కళ్లలో శుక్లాలు రాకుండా చేస్తుంది. కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. ఇందులోని విటమిన్ బి6 మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. శీతాకాలంలో ఎన్నో రకాల పండ్లు మార్కెట్లో అందుబాటులో ఉంటాయి. చాలా మంది పండ్లను ఇష్టంగా తింటారు. అలాంటి పండ్లలో స్టార్ ఫ్రూట్ కూడా ఒకటి. ఇది నక్షత్ర ఆకారంలో ఉండి, పసుపు రంగులో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఈ పండు రుచిలో అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యపరంగా కూడా అంతే ప్రయోజనకరం. స్టార్ ఫ్రూట్ రుచిలో తియ్యగా ఉండి క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిని తీసుకుంటే ఎక్కువ సమయం పాటు కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఆకలి వేయదు. దీంతో తీసుకునే ఆహార శాతం తగ్గుతుంది. ఫలితంగా అధిక బరువు తగ్గిపోతుంది. స్టార్ ఫ్రూట్‌లోని విటమిన్ బి6 శరీరమెటబాలిజంనుపెంచుతుంది. అందువల్ల క్యాలరీలు వేగంగా ఖర్చయ్యి కొవ్వు తగ్గిపోతుంది. స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దాంతో సీజనల్ వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.ఇంకా,ఈ పండ్లలోని విటమిన్ సి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది, చర్మం పగలకుండా ఉంటుంది. 100 గ్రాముల స్టార్ ఫ్రూట్‌లో సుమారు 2.8 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గ్యాస్,అసిడిటీ నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. మలబద్ధకం తగ్గుతుంది. నాడీ మండల వ్యవస్థ కూడా మెరుగుపడుతుంది, నరాల బలహీనత తగ్గుతుంది. మెడ, భుజం నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తితో పాటుగా పాటు కళ్ళను కూడా సంరక్షిస్తుంది. కంటి చూపు మెరుగు పడటానికి సహాయం చేస్తుంది. ఈ పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా కళ్లలో శుక్లాలు రాకుండా చేస్తుంది. కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. ఇందులోని విటమిన్ బి6 మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.

# చలికి చర్మం పగులుతోందా.. స్కిన్‌ను మృదువుగా చేసుకునే టిప్స్



చలికాలం వచ్చిందంటే చాలు.. చేతులు, కాళ్లు, ముఖం, పెదవులు – ఎక్కడ చూసినా పగుళ్లు, ఒళ్లు బొబ్బ, దురద! మార్కెట్లో లభించే మాశ్చరైజర్లు, క్రీమ్‌లు రాస్తే ఒక్క రోజు మాత్రమే రిలీఫ్, మళ్లీ తిరిగి అదే సమస్య రిపీట్? అవుతుంది. చలికాలం వచ్చిందంటే చాలు.. చేతులు, కాళ్లు, ముఖం, పెదవులు –ఎక్కడ చూసినా పగుళ్లు, ఒళ్లు బొబ్బ, దురద! మార్కెట్లో లభించే మాశ్చరైజర్లు, క్రీమ్‌లు రాస్తే ఒక్క రోజు మాత్రమే రిలీఫ్, మళ్లీ తిరిగి అదే సమస్య రిపీట్? అవుతుంది. చలికాలంలో ఉష్ణోగ్రత తగ్గడం, తేమ తగ్గిపోవడం వల్ల చర్మం పొడిబారి, పగుల్లు పడుతూ ఎర్రగా, దురదగా మారిపోతుంది. ముఖ్యంగా చేతులు, పాదాలు, పెదాలు, మోకాళ్లు దీనివల్ల ఎక్కువగా ప్రభావితం అవుతాయి. చిన్న పగుళ్లతో మొదలై లోతైన గాట్లు, రక్తం కారడం వరకూ వెళ్తే అసౌకర్యం, ఇన్ఫెక్షన్ భయం కూడా పొంచి ఉంటుంది. అయితే ఇది అనారోగ్యం కాదు, సరైన సంరక్షణతో ఈ సమస్యను పూర్తిగా తగ్గించవచ్చు. ఒక టీస్పూన్ చొప్పున ఆలివ్ ఆయిల్?, తేనె, అలోవెరా జెల్?ని ఒక గిన్నెలో తీసుకుని బాగా కలిపి రాత్రి ముఖం, చేతులు, కాళ్లపై రాసి బాగా మర్దన చేయాలి. ఉదయాన్నే స్నానం చేస్తే చర్మం మృదువుగా మెరుస్తుంది.రెండు టేబుల్ స్పూన్ల షియా బట్టర్‌ను డబుల్ బాయిలర్ పద్ధతిలో కరిగించి, ఒక టేబుల్? స్పూన్? కొబ్బరి నూనె, రెండు విటమిన్? ఇ టాబెట్లు వేసి బాగా కలిపి చల్లార్చాలి. ఒక గాజు సీసాలో స్టోర్ చేసి రోజూ రెండుసార్లు ముఖానికి, కాళ్లు, చేతులకు రాస్తే ఒక్క వారంలోనే పగుళ్లు పూర్తిగా మాయమవుతాయి. కొబ్బరి నూనె పగిలిన చర్మానికి చక్కని ఔషధంలా పనిచేస్తుంది. 2 టీస్పూన్ల కొబ్బరి నూనె, 1 టీస్పూన్ చక్కెర కలిపి రోజూ రాత్రి చేతులు, పాదాలకు జెంటిల్‌గా రుద్ది 5 నిమిషాలు మసాజ్ చేసి కడిగేయాలి. ఇలా చేయడం వల్ల మృతకణాలు తొలగిపోయి మెత్తదనం వస్తుంది. 2 టీస్పూన్ల తేనె, 5 చుక్కల నిమ్మరసం కలిపి పగుల్ల మీద రాసి 15 నిమిషాలు ఉంచి గోరువెచ్చని నీళ్లతో కడగాలి. ఇలా వారానికి రెండు మూడు సార్లు చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. గ్లిజరిన్, రోజ్ వాటర్?ను సమంగా కలిపి చేతులు, ముఖం, పెదాలకు రోజూ రెండు సార్లు రాయాలి. ఇది అద్భుతమైన మాయిశ్చరైజర్?లా పనిచేసి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. 2 టీస్పూన్ల ఓట్‌మీల్ పౌడర్, పాలు కలిపి పేస్ట్ చేసి పగుళ్ల మీద రాసి 15 నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల దురద, పొడిబారడం తగ్గుతాయి.రాత్రి పడుకునే ముందు మాయిశ్చరైజర్ రాసిన తర్వాత కాటన్ సాక్స్, గ్లౌజెస్ వేసుకుంటే చర్మం మెత్తబడుతుంది. చలికాలంలోనూ నీళ్లు ఎక్కువగా తాగాలి. గోరువెచ్చని నీళ్లతోనే స్నానం చేయాలి. ఎక్కువ వేడినీళ్లతో స్నానం చేస్తే చర్మం మరింత పొడిబారుతుంది. మరెందుకు ఆలస్యం.. ఇప్పుడే ట్రై చేసి చూడండి!

# స్థూలకాయంపై డబ్ల్యుహెచ్ఓ మార్గదర్శకాలు



ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మరణాలకు కారణమవుతున్న స్థూలకాయం సమస్యపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఊబకాయం చికిత్సలో వాడుతున్న గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1 రకం మందులు సమర్థవంతమైనవే అయినప్పటికీ, కేవలం వాటితోనే ఈ ప్రపంచ ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించలేమని సోమవారం విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేసింది.మందులతో పాటు జీవనశైలి మార్పులు కూడా అంతే ముఖ్యమని తేల్చిచెప్పింది.ప్రపంచవ్యాప్తంగా వంద కోట్లకు పైగా ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. పెద్దవారిలో బాడీ మాస్ ఇండెక్స్ 30 లేదా అంతకంటే ఎక్కువగా ఉండటాన్ని స్థూలకాయంగా పరిగణిస్తారు. దీని చికిత్స కోసం లిరాగ్లుటైడ్, సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ వంటి జీఎల్‌పీ-1 మందుల వాడకానికి డబ్ల్యూహెచ్ఓ షరతులతో కూడిన సిఫార్సులు చేసింది. ఈ మందులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటు బరువు తగ్గడానికి, గుండె, కిడ్నీ సమస్యల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి.అయితే, ఈ మందులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ విపరీతంగా పెరగడంతో నకిలీ, నాణ్యతలేని ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తున్నాయని డబ్ల్యూహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది.స్థూలకాయం ఒక దీర్ఘకాలిక వ్యాధి. దీనికి సమగ్రమైన చికిత్స అవసరం. కేవలం మందులతోనే ఈ సమస్యను అధిగమించలేం. అయితే, లక్షలాది మందికి చికిత్సలో జీఎల్పీ-1 మందులు ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడతాయి అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ తెలిపారు.ఈ మందులు వాడే వ్యక్తులు తప్పనిసరిగా ఆరోగ్యకరమైన ఆహార నియమాలు, క్రమం తప్పని వ్యాయామం వంటి జీవనశైలి మార్పులను అనుసరించాలని, ఆరోగ్య నిపుణుల పర్యవేక్షణలో ఉండాలని గైడ్‌లైన్స్‌లో స్పష్టం చేశారు. స్థూలకాయం వల్ల గుండె జబ్బులు, టైప్-2 డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ఈ సమస్యకు పరిష్కార మార్గాలు కనుగొనకపోతే 2030 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఏటా 3 ట్రిలియన్ డాలర్ల భారం పడుతుందని అంచనా వేసింది.

# రోజూ బ్రెడ్ ఆమ్లెట్ తింటే..



దేశంలో చాలా మందికి బ్రెడ్ ఆమ్లెట్ అంటే ఇష్టంగా తింటారు. ఇది త్వరగా సులభంగా చేసుకోవచ్చు. అంతేకాకుండా మంచి రుచితో కూడిన అద్భుతమైన అల్పాహారం. అయితే ఈ ఇష్టమైన ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవడం మన ఆరోగ్యానికి మంచిదేనా అనే సందేహం చాలామందిలో ఉంది. ప్రతిరోజూ బ్రేక్ ఫాస్ట్‌గా బ్రెడ్ ఆమ్లెట్‌ను తీసుకోవడం కామన్. బ్రెడ్ ఆమ్లెట్ ఆరోగ్యకరమైనదని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ తెలిపారు. అయితే అందులో వాడే బ్రెడ్ రకం, నూనె పరిమాణం చాలా ముఖ్యం. గుడ్డు అనేది ప్రోటీన్, విటమిన్లతో నిండిన ఆరోగ్యకరమైన ఆహారం. ఇది కండరాలు పెరగడానికి, మెదడుకు బాగా పనిచేయడానికి సహాయపడుతుంది. బ్రెడ్ ఆమ్లెట్ ఎంత ఆరోగ్యకరం అనేది మీరు ఎంచుకునే బ్రెడ్‌పై ఆధారపడి ఉంటుంది. తెల్ల రొట్టె: ఇందులో ఫైబర్ ఉండదు. ఇది త్వరగా జీర్ణమై, రక్తంలో చక్కెరను పెంచుతుంది. త్వరగా ఆకలి వేస్తుంది. హోల్ వీట్ బ్రెడ్ (గోధుమ బ్రెడ్): ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంటుంది. అందుకే ఇది ఉత్తమం. బరువు నియంత్రణ: గుడ్లలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి త్వరగా కడుపు నిండిన అనుభూతిని ఇచ్చి, బరువు తగ్గడానికి సహాయపడతాయి. హోల్ వీట్ బ్రెడ్ తో పాటు తక్కువ నూనె ఉపయోగిస్తే బరువు నియంత్రణలో ఉంటుంది. బరువు పెరుగుదల ప్రమాదం: తెల్ల రొట్టెతో పాటు ఎక్కువ నూనె లేదా వెన్న ఉపయోగించడం వల్ల కేలరీలు పెరిగి, బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఆమ్లెట్‌లో ఎక్కువ కూరగాయలను కలపడం, తృణధాన్యాల బ్రెడ్‌ను ఎంచుకోవడం ద్వారా పోషక విలువలను పెంచవచ్చు. అలాగే అధిక నూనె లేదా వెన్న వాడకూడదని నిపుణులు సలహా ఇస్తున్నారు. వీధి పక్కన లేదా క్యాంటీన్లలో కొనుగోలు చేసిన ఆమ్లెట్‌లను నివారించాలని డాక్టర్ పాటిల్ హెచ్చరిస్తున్నారు. షుగర్ లేదా గుండె జబ్బులు ఉన్నవారు మితంగా తీసుకోవడంపై వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

## బిజినెస్


# కనిష్ట స్థాయికి రూపాయి విలువ

మనదేశ కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల ధోరణి, విదేశీ నిధుల ఉపసంహరణ కారణంగా సోమవారం అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 34 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి రూ. 89.79కి చేరుకుంది. డాలర్ బలంగా ఉండటం, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల భారత కరెన్సీని దెబ్బతీశాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. మరోవైపు, దిగుమతిదారుల నుంచి డాలర్ డిమాండ్ కూడా మన కరెన్సీపై ఒత్తిడి పెంచింది. ఈ వారం ఇంటర్‌బ్యాంక్ విదేశీ ద్రవ్య మార్కెట్లో రూపాయి రూ. 89.45 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత మరింత బలహీనపడి రూ. 89.79కి పడిపోయింది. ఎఫ్‌పీఐలు మన మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకోవడం, అధిక వాల్యుయేషన్, చమురు బంగారం కొనుగోళ్ల కారణంగా రూపాయి ఒత్తిడిలోకి చేరిందని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్ ఎల్‌ఎల్‌పీ హెడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ భన్సాలి అన్నారు. అమెరికాతో వాణిజ్య చర్చల ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని, ఏడాది చివరి నాటికి పరిష్కారం లభిస్తుందనే అంచనాలు న్నాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఉదయం సానుకూలంగానే ట్రేడింగ్ మొదలైనప్పటికీ కొద్దిసేపటి తర్వాత నష్టాల్లోకి జారాయి. ఇందుకు ప్రధానంగా ఆర్‌బీఐ రేటు తగ్గింపుపై అంచనాలు తగ్గడం, బలమైన జీడీపీ వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణ పరిస్థితుల మధ్య సెంట్రల్ బ్యాంకు రేట్లను స్థిరంగా ఉంచవచ్చనే ఊహాగానాలు పెరిగాయి. దీనికి తోడు రూపాయి



జీవితకాల కనిష్టానికి చేరడం, అమెరికాతో వాణిజ్యంపై ఆం దోళనలు మార్కెట్ల బలహీనతకు కారణమయ్యాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 64.77 పాయింట్లు పడిపోయి 85,641 వద్ద, నిఫ్టీ 27.20 పాయింట్లు తగ్గి 26,175 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో టీఎంపీవీ, మారుతీ సుజుకి, బీఈఎల్, కోటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాలను దక్కించుకున్నాయి. బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాలను నమోదు చేశాయి.

## పారిశ్రామికోత్పత్తి మందగమనం



దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) మందగిం చింది. ప్రజల ఆదాయాలు సన్నగిల్లడంతో డిమాండ్ పడిపోవడంతో అంతిమంగా పారిశ్రామిక ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ముఖ్యంగా విద్యుత్, మైనింగ్, తయారీ రంగాలు అత్యంత పేలవమైన డిమాండ్‌ను చవి చూశాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది అక్టోబర్‌లో పారిశ్రామికోత్పత్తి సూచీ 0.4 శాతానికి మందగించింది. కేంద్ర గణాంకాల శాఖ (ఎన్‌ఎస్ఓ) సోమవారం విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఐఐపీ 0.4 శాతానికి పరిమితమై ఏడాది కనిష్ట స్థాయిని చవి చూసింది. 2024 అక్టోబర్‌లో 3.7 శాతం వృద్ధిని కనబర్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ ఐఐపీ గణాంకాలను 4 శాతం నుంచి 4.6 శాతానికి సవరించింది. ఐఐపీలో ప్రధానమైన తయారీ రంగం 2025 అక్టోబర్‌లో 1.8 శాతం పెరుగుదలతో సరిపెట్టుకుంది. గతేడాది ఇదే నెలలో తయారీ రంగం 4.4 శాతం వృద్ధిని సాధించింది. ఇదే నెలలో మైనింగ్ ఉత్పత్తి మైనస్ 0.9 శాతంగా ఉండగా.. గడిచిన అక్టోబర్‌లో రెట్టింపై మైనస్ 1.8 శాతానికి క్షీణించింది. విద్యుత్ ఉత్పత్తి 2024 అక్టోబర్‌లో మైనస్ 2 శాతంగా ఉండగా.. 205 అక్టోబర్‌లో మరింత పతనమై మైనస్ 6.9 శాతానికి కుంచించుకుపోయింది. క్యాపిటల్ గూడ్స్ విభాగం 2.4 శాతానికి తగ్గగా.. ఏడాది క్రితం 2.9 శాతం పెరుగుదల ఉంది. కన్స్యూమర్ డ్యూరెబుల్స్ ఉత్పత్తి 4.4 శాతం నుంచి 2.8 శాతానికి పడిపోయింది. తయారీ రంగంలో 23 పరిశ్రమల విభాగాల్లో 9 మాత్రమే సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక సంవత్సరం 2025-26 ఏప్రిల్-అక్టోబర్ కాలంలో దేశ పారిశ్రామిక ఉత్పత్తి 2.7 శాతానికి పడిపోయింది. గతేడాది ఇదే కాలంలో 4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది.

## నవంబరులో వాహన విక్రయాల రికార్డు



పండగ సీజన్ తరవాతా కొనుగోలుదార్ల నుంచి గిరాకీ బాగుండటంతో, గత నెలలో వాహన టోకు విక్రయాలు పెరిగాయి. దిగ్గజ సంస్థలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా 2024 నవంబరుతో పోలిస్తే, గత నెలలో బలమైన గణాంకాలను నమోదు చేశాయి. మారుతీ సుజుకీ ఇండియా 40 ఏళ్లలోనే అత్యధికంగా నవంబరులో 2,29,021 వాహనాలను విక్రయించింది. ఇందులో దేశీయ డీలర్లకు 1,70,971 వాహనాలను సరఫరా చేసింది. 2024 నవంబరులో సరఫరా చేసిన 1,41,312 వాహనాలతో పోలిస్తే ఇవి 21% అధికం. ఎగుమతులు 28,633 నుంచి 46,057కు పెరిగాయి. తేలికపాటి వాణిజ్య వాహనం సూపర్ క్యారీ వాహనాలు 3622 అమ్ముడయ్యాయి. చిన్న కార్లు, స్పోర్ట్స్ వినియోగ వాహనాల (ఎస్‌యూవీ)తో పాటు అన్ని విభాగాల్లో సంస్థ వృద్ధి కనబరిచింది. పెండింగ్‌లోనే 1.50 లక్షల కార్లు: నవంబరులో రిటెయిల్ వృద్ధి 31 శాతమని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, విక్రయాలు) పార్థో బెనర్జీ వెల్లడించారు. చిన్న కార్లలో ఎస్‌ప్రెసో, ఆల్టో, కె10, సెలెరియో, వ్యాగన్‌ఆర్ విక్రయాల్లో 37% వృద్ధి నమోదైందని తెలిపారు. తమ మొత్తం వాహన విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 30 శాతమని పేర్కొన్నారు. ప్రస్తుతం 8 మోడళ్ల నిల్వలు లేవని, బుకింగ్‌లు సుమారు 1.5 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. కార్లకు గిరాకీ బలంగా ఉంటుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ 5-6% వృద్ధి నమోదు చేస్తుందని అభిప్రాయపడ్డారు.

## పెట్టుబడి నిర్ణయాలపై ఎల్ఐసీకి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇవ్వదు



ప్రభుత్వ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి ఎలా పెట్టుబడి పెట్టాలనే దానిపై ఎటువంటి సలహా లేదా దిశానిర్దేశం ఇవ్వలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం స్పష్టం చేసింది.ఎల్ఐసీ తీసుకునే పెట్టుబడి నిర్ణయాలు స్వతంత్రంగా ఉంటాయని, కఠినమైన చర్యలు, రిస్క్ అంచనా, సరైన అనుమతుల ద్వారానే జరుగుతాయి. బీమా చట్టం-1938 నిబంధనలు, అలాగే ఐఆర్‌డీఏఐ, ఆర్‌బీఐ, సెబీ నిబంధనల ఆధారంగా ఎల్ఐసీ పెట్టుబడులు పెడుతుంది. ఈ విషయం గురించి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. మంత్రిత్వ శాఖ లేదా ఆర్థిక సేవల విభాగం, ఎల్ఐసీ లేదా ఇతర ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలకు అదానీ గ్రూప్ కంపెనీలలో పెట్టుబడి పెట్టడంపై ఎలాంటి ఆదేశాలు లేదా సలహాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి ఎల్ఐసీకి ఆర్థిక మంత్రిత్వశాఖ ఆదేశాలిచ్చినట్టు అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్ట్ రెండు నెలల క్రితం కథనం వెలువరించిన సంగతి తెలిసిందే. దీన్ని ఎల్ఐసీ ఖండించింది. పెట్టుబడులు పూర్తిగా తమ సొంత నిర్ణయమని ప్రకటన జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్‌లో అడిగిన ఓ ప్రశ్నకు నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారు. ఎల్ఐసీ పెట్టుబడులకు సంబంధించి సొంతంగానే నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎల్ఐసీ పెట్టుబడులు ఎన్‌ఎస్ఈ, బీఎస్ఈలలోని టాప్ 500 కంపెనీలలో పెట్టుబడి పెడుతుం దని ఆర్థిక మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఎల్ఐసీ పెట్టుబడుల్లో ఎక్కువ భాగం పెద్ద కంపెనీలలో ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి నిఫ్టీ 50 కంపెనీలలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ. 4.31 లక్షల కోట్లు, ఇది మొత్తం ఈక్విటీ పెట్టుబడిలో 45.85 శాతానికి సమానమని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ డెట్ సెక్యూరిటీలలోని పెట్టుబడులను కలుపుకుంటే ఇది రూ. 9.4 లక్షల కోట్లు ఉంటాయని నిర్మలా సీతారామన్ చెప్పారు.

# ఐపీఎల్ వేలంలో 1,355 మంది.. రూ.2 కోట్ల ధరలో భారత క్రికెటర్లు ఇద్దరే!

ప్రతిభావంతులైన క్రికెటర్లపై కాసుల వర్షం కురిపించే ఐపీఎల్ వేలానికి సమయం దగ్గరపడుతోంది. డిసెంబర్ 16న అబుధాబీలో మినీ వేలం నేపథ్యంలో ఫ్రాంచైజీలు మ్యాచ్ విన్నర్లను కొనేందుకు సన్నద్ధమవుతున్నాయి. సర్వత్రా ఆసక్తి రేపుతున్న పంతొమ్మిదో సీజన్ కోసం 1,355 మంది క్రికెటర్లు పేర్లు నమోదు చేసుకున్నారు. రూ.2 కోట్ల ధరలో 45 మంది ఉండగా.. వీరిలో ఇద్దరు భారత క్రికెటర్లే ఉండడం గమనార్హం. మినీ వేలంలో నిలిచిన ఆటగాళ్ల వివరాలను నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. అన్‌క్యాప్డ్ ఇండియన్ క్రికెటర్లు 928 మంది వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ వేలం ముగియడంతో ఐపీఎల్ వేలంపై అందరూ దృష్టి సారిస్తున్నారు. ఈసారి వేలంలో భారీ ధర పలికేది ఎవరు? ఏ ఫ్రాంచైజీ ఎవరిని కొంటుంది? వంటి విషయాలు జోరుగా చర్చిస్తున్నారు. వేలానికి మరో రెండు వారాలే ఉన్నందున మంళవారం ఆటగాళ్ల జాబితాను ఐపీఎల్ నిర్వాహకులు విడుదల చేవారు. ఈ దఫా 1,355 మంది వేలంలో నిలవగా.. రూ.2 కోట్ల కనీస ధరకు పేర్లు నమోదు చేసుకున్నవాళ్లు 45 మంది ఉన్నారు. ఆశ్చర్యంగా వీరిలో భారత్ నుంచి ఇద్దరికి మాత్రమే చోటు దక్కింది. లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ పవర్ హిట్టర్ వెంకటేశ్ అయ్యర్ మాత్రమే రెండు కోట్ల క్లబ్‌లో ఉన్నారు. ఐపీఎల్ వేలానికొస్తున్న ఇతర దేశాల ఆటగాళ్లు.. రూ.2 కోట్ల ధరలో ఉన్న క్రికెటర్ల వివరాలు చూద్దాం.



వేలంలో పేర్లు నమోదు చేసుకున్నవారు - 1,355.
భారత క్రికెటర్లు - 1,062.
అన్‌క్యాప్డ్ ఇండియన్స్ - 928.
గతంలో ఐపీఎల్ ఆడిన అన్‌క్యాప్డ్ భారత క్రికెటర్లు- 118.
విదేశీ క్రికెటర్లు -293
క్యాప్డ్ విదేశీ ఆటగాళ్లు %- 196
అసోసియేట్ దేశాల ప్లేయర్లు %- 22
గతంలో ఐపీఎల్ ఆడిన అన్‌క్యాప్డ్ విదేశీ క్రికెటర్లు %- 2
అన్‌క్యాప్డ్ విదేశీ క్రికెటర్లు %- 73

రూ.2 కోట్ల ధరకు రిజిష్టర్ అయిన క్రికెటర్లు %- 45

2 కోట్ల ధరలో వీళ్లే..

మినీ వేలం కోసం రూ.2 కోట్ల కనీస ధరకు పేర్లు నమోదు చేసుకున్న వారిలో ఈసారి విదేశీయులే అధికం. భారత్ నుంచి రవి బిష్ణోయ్, వెంకటేశ్ అయ్యర్ మాత్రమే ఈ బేస్ ప్రైజ్‌లో నిలిచారు. న్యూజిలాండ్ నుంచి అత్యధికంగా 10 మంది, ఇంగ్లండ్ క్రికెటర్లు 9 మంది.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఏడుగురు రూ.2 కోట్ల ధరతో వేలంలోకి వస్తున్నారు. శ్రీలంక, వెస్టిండీస్ ఆటగాళ్లు నలుగురు, అత్యల్పంగా బంగ్లాదేశ్ నుంచి ఒక్కరు మాత్రమే ఈ కనీస ధరతో రిజిష్టర్ అయ్యారు.

ఇంగ్లండ్ - బెన్ డకెట్, లివింగ్‌స్టోన్, టైమల్ మిల్స్, జేమీ స్మిత్. గస్ అట్కిన్సన్, టామ్ బ్యాంటన్, టామ్ కరన్, లియాం డాసన్, డానియెల్ లారెన్స్,

న్యూజిలాండ్ - రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, మైఖేల్ బ్రేస్‌వెల్, డెవాన్ కాన్వే, ఫిన్ అలెన్,జాకబ్ డఫ్ఫీ, మ్యాట్ హెన్రీ, కైల్ జేమీసన్, ఆడమ్ మిల్నే, విలియం ఓ రూర్కీ.

## అలాంటి ఆటగాళ్లు వదులుకోవడం అంత తేలికైన విషయం కాదు : హేమంగ్ బదానీ



దక్షిణాఫ్రికా డ్యాషింగ్ బ్యాట్స్‌మెన్ ఫఫ్ డు ప్లెసిస్‌ను జట్టును తప్పించడం అంత తేలిక నిర్ణయం కాదని ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్ హేమంగ్ బదానీ పేర్కొన్నారు. డు ప్లెసిస్ తన ఐపీఎల్ కెరీర్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రైజింగ్ పూణే సూపర్‌జెయింట్స్ బరిలోకి దిగాడు. గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌లో సభ్యుడిగా ఉన్నాడు. అయితే, బదానీ మాట్లాడుతూ 'ఫఫ్ డు ప్లెసిస్ లాంటి ఆటగాడిని వదులుకోవడం అంత సులభం కాదు. సంవత్సరాలుగా ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించాడు. అతని జట్టులో నుంచి తప్పించడం కఠినమైన నిర్ణయం' అని జియోస్టార్‌లో జరిగిన టాటా ఐపీఎల్ రిటెన్షన్ షోలో బదానీ వ్యాఖ్యానించాడు. మరింత దూకుడుగా ఉండే, జట్టు ఆటతీరుకు అనుగుణంగా మారే యువ ప్లేయర్ల కోసం ప్రయత్నించాల్సిన సమయం ఆసన్నమైందని భావించామని తెలిపాడు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ జాక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌ను విడుదల చేయాలనే నిర్ణయంపై బదానీ స్పందిస్తూ.. గత సీజన్‌లో ప్రదర్శన ఆధారంగా అతనికి మద్దతు ఇచ్చామని.. కానీ అతనికి రూ.9 కోట్లు ఇవ్వడం సాధ్యం కాదని ప్రస్తుతం భావించి.. అతన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌లో మంచి భారతీయ ప్లేయర్లు ఉన్నారని.. కానీ ఓపెనింగ్ జోడీపై పని చేయాల్సిన అవసరం ఉందని భారత జట్టు మాజీ హెడ్‌కోచ్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డారు. నితీశ్ రాణా, కేఎల్ రాహుల్, అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్ జట్టులో ఉన్నారని.. టాప్ ఆర్డర్‌లో ఎవరు ఎక్కడ ఆడాలో నిర్ణయించాల్సి ఉంటుందన్నారు.

## స్పోర్ట్స్

# అనుకున్నదే జరిగింది..! ఆస్ట్రేలియా భారీ షాక్




ఇంగ్లండ్‌తో రెండో యాషెస్ టెస్టుకు ముందు ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. గురువారం నుంచి ప్రారంభమయ్యే పింక్ బాల్ టెస్టుకు ఆసీస్ స్టార్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా దూరమయ్యాడు. ఖవాజా ప్రస్తుతం వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు. ఈ కారణం చేతనే పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో అతడు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు రాలేదు. అయితే రెండో టెస్టుకు దాదాపు పది రోజుల విశ్రాంతి లభించడంతో అతడు కోలుకుంటాడని క్రికెట్ ఆస్ట్రేలియా భావించింది. కానీ ఉస్మాన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించలేకపోయాడు. మంగళవారం 30 నిమిషాల పాటు ప్రాక్టీస్ సెషన్‌లో ఖవాజా పాల్గొన్నాడు. కానీ అతడు అసౌకర్యంగా కనిపించాడు. దీంతో ఖవాజాను రెండో టెస్ట జట్టు నుంచి క్రికెట్ ఆస్ట్రేలియా తప్పించింది. అతడి స్థానంలో ఎవరు ఓపెనింగ్ చేస్తారన్న విషయాన్ని మాత్రం సీఏ వెల్లడించలేదు. తొలి టెస్ట రెండో ఇన్నింగ్స్‌లో విధ్వంసకర సెంచరీతో చెలరేగిన హెడ్.. సెకెండ్ టెస్టులో కూడా ఓపెనర్‌గా వచ్చే అవకాశముంది. అదే విధంగా ఖవాజా స్థానంలో తుది జట్టులోకి ఆల్‌రౌండర్ వెబ్‌స్టర్ రానున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. కాగా ఈ టెస్టుకు కూడా కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్, పేసర్ జోష్ హాజిల్‌వుడ్ దూరమయ్యాడు. ఈ క్రమంలో స్టీవ్ స్మిత్ వరుసగా రెండో మ్యాచ్‌లను కంగారుల జట్టుకు సారథ్యం వహించనున్నాడు. రెండో టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కారీ, బ్రెండన్ డాగెట్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుషేన్, నాథన్ లియాన్, మైఖేల్ నేజర్, మిచెల్ స్టార్క్, జేక్ వెదరాల్డ్, బ్యూ వెబ్‌స్టర్.

# పసుపు అంటిన పది నోటు ఎక్కడ?




కంటెంట్ ఉంటే చాలు హీరోహీరోయిన్లను పట్టించుకోకుండా సినిమాను ఆదరిస్తారు తెలుగు ప్రేక్షకులు. అందుకే ఈ మధ్యకాలంలో స్టార్స్‌ని కంటె కంటెంట్‌ని నమ్ముకొని సినిమాలను తెరకెక్కిస్తున్నారు. అలా ఓ డిఫరెంట్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రమే 'పైసావాలా'. అధ్విక్ అలియాస్ రాజేష్ బెజ్జంకి, శ్రీధర్, సృజనక్షిత, పి. అన్ను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కె. నవీన్ తేజస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫైవ్ ఎలిమెంట్స్ క్రియేషన్స్, , వీకేఎం మూవీస్ బ్యానర్లపై నూనెల పైడిరాజు, కె. నవీన్ తేజస్, పిజె దేవి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఇక తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ని ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ రిలీజ్ చేసి చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ట్రైలర్ విషయానికొస్తే..'హవాలా నోటు తీసుకొస్తున్న ఎమ్మెల్యే బామ్మర్దికి యాక్సిడెంట్ అయింది. ఆ తర్వాత ఫోన్, పర్సు మిస? అయింది. అందులోనే హవాలా నోటు ఉంది. ఆ పని నీవల్లే అవుతుందంటూ' ఓ మహిళ..హీరోకి చెప్పే సీన్‌తో ఆసక్తికరంగా ప్రారంభం అయింది. పసుపు అంటిన పది రూపాయల నోటు కోసం వేరు వేరు గ్యాంగులు తిరగడం.. ఈక్రమంలో బెదిరింపులు, హత్యలు.. కొత్త కొత్త పాత్రల ఎంట్రీతో ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. చివరిలో తొమ్మిది పాత్రలను చూపిస్తూ..వీరిలో అపరాధి ఎవరంటూ సినిమాపై ఆసక్తిని పెంచేశారు. ఈ చిత్రానికి నగేశ్ గౌరీష్ సంగీతం అందించగా, గౌతం వాయిలాడ సినిమాటోగ్రాఫర్‌గా, ఎంజే సూర్య ఎడిటర్‌గా వ్యవహరించారు. డిసెంబర్ 12న విడుదల కానుంది.

## 'సైకో సిద్ధార్థ'గా నందు.. బోల్డ్‌గా ట్రైలర్



టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్ధార్థ'. మీలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది. ఎక్కువగా బూతులతోనే ట్రైలర్‌ను నింపేశారు.

## నా రిటైర్మెంట్ అప్పుడే... వెల్లడించిన కమల్ హాసన్



71 ఏళ్ల వయసులోనూ వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు విశ్వనటుడు కమల్ హాసన్. యంగ్ హీరోలకు ధీటుగా ఏడాదికో సినిమా రిలీజ్ చేస్తున్నాడు. ఇటీవల ఆయనను రాజ్యసభ పదవి వరించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన సినీ కెరీర్‌పై రకరకాల పుకార్లు వచ్చాయి. ఇక ఆయన సినిమాల్లో నటించబోరనే వార్తలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో తన రిటైర్మెంట్ పై తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఏదైనా ఓ మంచి సినిమా తీసి రిటైర్మెంట్ అవుతానని చెప్పారు. తాజాగా ఆయన నటి మంజు వారియర్‌తో కలిసి కేరళలో ఆర్ట్ అండ్ లిటరేచర్‌పై జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన పదవి విరమణపై ఎదురైన ప్రశ్నకు పైవిధంగా సమాధానం చెప్పారు.


'నన్ను రిటైర్ అవ్వమని ఎవ్వరూ అడగడం లేదు. కానీ కొన్నిసార్లు నాకే ఇక సినిమాలు ఆపేయాలనిపిస్తుంది. ముఖ్యంగా నా నుంచి వచ్చిన సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తాపడిన ప్రతిసారి అలానే అనిపిస్తుంది. కానీ నా శ్రేయోభిలాషులు, అభిమానులు మాత్రం సినిమాలు ఆపొద్దని చెబుతున్నారు. 'ఒక మంచి సినిమా తీసి సినిమాలు ఆపేయండి' అని సలహాలు ఇస్తున్నారు. నేను కూడా అలాంటి ఓ మంచి సినిమా కోసమే ఎదురు చూస్తున్నాను' అని కమల్ చెప్పుకొచ్చాడు. మొత్తానికి ఓ బ్లాక్ బస్టర? సినిమా తీసి సినీ కెరీర్‌కి గుడ్‌బై చెప్పాలని కమల్ భావిస్తున్నాడు. మరి ఆ చిత్రం ఎప్పుడొస్తుందో చూడాలి. ఇటీవల ఆయన 'థగ్‌లైఫ్'తో ప్రేక్షకుల ముందుకు రాగా.. అది ఘోరంగా విఫలం అయింది. ప్రస్తుతం ఆయన చేతిలో కల్కి 2 చిత్రం ఉంది. అలాగే లోకేష్ కనగరాజ్‌తో విక్రమ్ 2 కూడా తెరకెక్కించే ప్రయత్నాల్లో ఉన్నాడు. మరోవైపు రజనీకాంత్ హీరోగా ఓ సినిమాను నిర్మించబోతున్నాడు. ఈ చిత్రానికి ఇంకా దర్శకుడు ఖరారు కాలేదు.

## 'యానిమల్' సినిమా ఆఫర్ వచ్చి ఉంటే నో చెప్పేదాన్ని



బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' లవంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## ప్రభాస్ ది రాజా సాబ్.. అత్తారింటికి దారేది నటుడి స్పెషల్ పోస్టర్..!



రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న చిత్రం " ది రాజా సాబ్". ఈ రొమాంటిక్ హారర్ కామెడీ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రంలో అత్తారింటికి దారేది నటుడు బోమన్ ఇరానీ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇవాళ ఆయన బర్త్ ?డే కావడంతో మేకర్స్ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మూవీ టీమ్ స్పెషల్ పోస్టర్ పంచుకున్నారు. ఈ సినిమాలో సైకియాట్రిస్ట్, హిప్నాటిస్ట్, పారానార్మల్ ఇన్వెస్టిగేటర్‌గా బొమన్ ఇరానీ ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు. కాగా.. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వప్రసాద్,కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ మూవీ జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సినిమాకు తమన్ సంగీతమందిస్తోన్న సంగతి తెలిసిందే.

## లెజెండరీ దర్శకుడు వి. శాంతారామ్‌పై బయోపిక్.. హీరో ఎవరంటే.!



బాలీవుడ్ సినీ చరిత్రలో సుప్రసిద్ధ దర్శకుడు, నటుడు అయిన దిగ్గజ చలనచిత్ర నిర్మాత వి. శాంతారామ్ జీవితం వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ఆయన జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కనున్న ఈ బయోపిక్‌లో ప్రముఖ బాలీవుడ్ యువ నటుడు సిద్దాంత్ చతుర్వేది టైటిల్ రోల్‌లో నటించనున్నారు. ఈ బయోగ్రాఫికల్ డ్రామాకు 'వి. శాంతారామ్' అనే పేరును ఖరారు చేశారు. ఈ చిత్రానికి అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహించబోతుండగా.. రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే మరియు సరిత అశ్విన్ వర్దే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వి. శాంతారామ్ యొక్క అద్భుతమైన సినీ ప్రయాణాన్ని చూపించనుంది. సైలెంట్ యుగం (మూకీ సినిమాల కాలం) నుంచి టాకీలు (శబ్దంతో కూడిన సినిమాలు) ఆపై కలర్ సినిమా యుగం వరకు ఆయన చేసిన కృషి, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన ఘనమైన ప్రస్థానాన్ని ఈ చిత్రం తెరకెక్కించనుంది. 1901 నవంబర్ 18, 1901లో మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో జన్మించిన వి. శాంతారామ్ 1921లో నటుడిగా వెండితెరపై అడుగుపెట్టాడు. అనంతరం నటనతో పాటు మొత్తం 55కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించాడు. ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) లాంటి సంస్థలు స్థాపించి 92 సినిమాలకు పైగా నిర్మాతగా వ్యవహరించాడు. శాంతారామ్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం అతడిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), పద్మవిభూషణ్ (1992 మరణానంతరం) లతో సత్కరించింది.

# ఇక మొత్తం నాలుగు బ్యాంకులే




**ముంబై :** ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేసింది. అప్పట్లో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సంచలనం సృష్టించింది.. ఇప్పుడిక మళ్లి విడత విలీన ప్రక్రియకు కేంద్రం సిద్ధమవుతున్న తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక అసలైన అంతరార్థం ఏంటనేది సామాన్యులకు అంతు పట్టకుండా ఉంది. ప్రస్తుతం మన దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు 12 వరకు ఉన్నాయి. వీటి సంఖ్యను నాలుగు వరకు తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా నాలుగు పెద్ద బ్యాంకులుగా మారుస్తామని చెబుతోంది.. ఇకపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా ? యూనియన్ బ్యాంకులు మాత్రమే ఉంటాయని తెలుస్తోంది. మిగతా బ్యాంకులను వీటిలో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంకు విలీనం. గతంలో యూనియన్ బ్యాంకులో ఆంధ్ర బ్యాంకు విలీనమైంది. ఇప్పుడు కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ విలీనం అయ్యే అవకాశం కనిపిస్తోంది. వీటికింద ఇండియన్ బ్యాంకు, యూకో బ్యాంక్ లను తీసుకొస్తారని ప్రచారం జరుగుతుంది. తద్వారా ఏర్పాటయ్యే పెద్ద బ్యాంకు తోపాటు, వచ్చే రోజుల్లో కేవలం ఎస్బిఐ, పిఎన్బి, బి ఓ బి లను మాత్రమే కొనసాగించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ఇతర మధ్య తరహా ప్రభుత్వ రంగ బ్యాంకులైన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఎస్బిఐ, పిఎన్బి, బి ఓ బి లో విలీనం చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు పంజాబ్ అండ్ సింధు బ్యాంకుపై ఇప్పటివరకు కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఇప్పటికైతే విలీనం గురించి చర్చలు మాత్రమే జరుగుతున్నాయి. ఆర్థిక మంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపించిన తర్వాత.. అక్కడి నుంచి అనుమతి అనేది లభించిన తర్వాత.. క్యాబినెట్ సెక్రటేరియట్ లో ఉన్నతాధికారుల అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత ప్రధాన కార్యాలయం వరకు పంపిస్తారు. మార్కెట్లను నియంత్రించే సెబీ పరిశీలనకు కూడా ఈ ఫైల్ వెళ్తుంది. ఇవన్నీ ఓకే అయితే వచ్చే ఏడాది విలీన ప్రక్రియ పూర్తవుతుంది. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడత విలీన ప్రక్రియలో 27 నుంచి 12 వరకు బ్యాంకుల సంఖ్యను తగ్గించారు. బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం.. కార్యాలయాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం.. అంతర్జాతీయంగా పోటీని పెంచడం వంటి వాటి ద్వారా బ్యాంకుల విలీన ప్రతిపాదనను ఆర్థిక శాఖ రూపొందించినట్లు తెలుస్తోంది.. పెద్ద బ్యాంకులుగా ఏర్పాటు చేయడం వల్ల ఖాతాదారుల్లో కూడా విశ్వసనీయత పెరుగుతుందని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు.

# మారని పాకిస్తాన్ వక్రబుద్ధి

## వరద బాధితులకు ఎక్స్పైర్ ఫుడ్




**లాహోర్ :** పాకిస్థాన్ చిల్లర పనులకు అంతేలేకుండా పోతుంది. భారతదేశంపై నిత్యం అసత్యాలతో కూడిన వ్యాఖ్యలు చేసే పాకిస్థాన్.. తమ దేశంలో పరిస్థితులు దిగజారుతున్నా సరిచేసుకొనే ప్రయత్నం చేయడం చేయడం లేదు. పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నా.. ఉగ్రవాదులను పెంచిపోషిస్తూ భారతదేశంపై దాడులకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే, తాజాగా.. పాకిస్థాన్ తనకు అలవాటుగా మారిన చిల్లర పనులతో ప్రపంచ దేశాల ముందు పరువు పోగొట్టుకుంది.దిత్వా తుపాను ఇటీవల శ్రీలంకలో విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ తుపాను కారణంగా ఆ దేశం అతలాకుతలమైంది. భారీ వర్షాల కారణంగా 350మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. దాదాపు 11.18లక్షల మందిపై విపత్తు ప్రభావం పడిందని శ్రీలంక పేర్కొంది. దిత్వాతో భారీ నష్టపోయిన శ్రీలంకను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. భారతదేశం కూడా శ్రీలంకకు అండగా నిలిచింది.శ్రీలంకలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో భారత ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఆపదలో ఉన్నవారిని రక్షిస్తున్నాయి. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట శ్రీలంకలో భారత్ సహాయక చర్యలు నిర్వహిస్తోంది. అంతేకాక.. తమ వంతుగా ఆహారం, వైద్య సామగ్రి, అత్యవసర సదుపాయాలను శ్రీలంకకు అందిస్తోంది.దిత్వా తుపాను ప్రభావంతో వణుకుతున్న శ్రీలంక కు భారత్ తో పాటు పాకిస్థాన్ సాయం అందించింది. అయితే, పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సింది పోయి.. వారికి గడువు ముగిసిన వస్తువులను సాయంగా పంపించిందనే వార్తలు వస్తున్నాయి. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పాకిస్థాన్ హైకమిషన్ సోషల్ మీడియాలో స్వయంగా పంచుకున్న కొలంబోకు వెళ్లే సహాయ ప్యాకేజీలపై గడువు తేదీ ఇప్పటికే ముగిసినట్లుగా ఉంది. దీంతో పాకిస్థాన్ తీరుపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీలంకకు సాయంగా ఆహారం, ఔషధాలను పాకిస్థాన్ పంపించింది. ఇవి కొలంబోకు చేరుకున్న విషయాన్ని తెలయజేస్తూ శ్రీలంకకు పాకిస్థాన్ ఇప్పుడు ఎప్పుడూ అండగా ఉంటుంది అని ముద్రించిన ప్యాకెట్లను శ్రీలంకలోని పాకిస్థాన్ హై కమిషన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.

ఆ ప్యాకెట్లపై గడువు తేదీ 2024 అక్టోబర్ లోనే ముగిసినట్లు తెలిసింది. వీటిని గమనించిన శ్రీలంక అధికారులు.. ఈ విషయాన్ని పాకిస్థాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పాకిస్థాన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ పొరుగుదేశాలకు అందించే సహాయంలోనూ చిల్లర పనులకు పాల్పడటంతో ప్రపంచ దేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ.. బీజేపీ ఎంపీలకు ప్రధాని కీలక సూచనలు



వచ్చే ఏడాది పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ‘ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాంతో ఎస్ఐఆర్ నిర్వహణపై బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హతలేని వారిని తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఎంపీలను ప్రధాని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని మోదీ సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు ప్రచురితమయ్యాయి. అదేవిధంగా 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండానే విపక్షాల ట్రాప్‌లో పడవద్దని ఎంపీలను హెచ్చరించారు. అదేవిధంగా ఆ రాష్ట్రంలో బీజేపీ ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, 2021లో ఆ సంఖ్య 65కు చేరిందని చెప్పారు. స్థానిక అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఎంపీలను కోరారు. కాగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## 2028లో భారతీయ అంతరిక్ష స్టేషన్




2028 సంవత్సరం నాటికి స్పేస్ లో “భారతీయ అంతరిక్ష స్టేషన్” ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్రం ప్రభుత్వం తెలిపింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతోనే దీని నిర్మాణం చేపడుతున్నామని పార్లమెంటులో బుధవారం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేందర్ సింగ్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి తొలి మాడ్యూల్ ప్రక్రియ సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని కేంద్రమంత్రి జితేందర్ సింగ్ తెలిపారు. దీనికి సంబంధించిన కీలమైన డిజైన్ మైల్ స్టోన్ ను ఇస్రో పూర్తిచేసిందన్నారు. దీని నిర్మాణం పూర్తయితే భారత వ్యోమగాములు అంతరిక్ష ప్రయాణం, సాంకేతిక ప్రయోగాలు, పరిశోధనలు చాలా సులభతరమైతాయని వారు పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్ 1న భారతీయ అంతరిక్ష స్టేషన్ మ్నెదటి మాడ్యూల్ నిర్మాణానికి పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీనికి రూ.20,193 కోట్ల నిధులు కేటాయించగా 2028 వరకూ పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. 2035 నాటికి ఇది పూర్తిస్థాయిలో సేవలు అందించే అవకాశం ఉంది. భారతీయ అంతరిక్ష స్టేషన్ ఏర్పాటు పూర్తయితే అమెరికా, రష్యా, చైనా దేశాల తర్వాత స్పేస్ లో స్వంత అంతరిక్ష స్టేషన్ కలిగిన నాలుగవ దేశంగా భారత్ రికార్డు సృష్టిస్తుంది.

## కొత్త ఫోన్‌లలో ‘సంచార్ సాథీ’ తప్పనిసరేం కాదు

కొత్తగా తయారయ్యే మొబైల్ ఫోన్లలో ‘సంచార్ సాథీ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరేం కాదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. యాప్‌ను తప్పనిసరి చేస్తూ గతంలో జారీచేసిన ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్లు బుధవారం భారత టెలికామ్ విభాగం ప్రకటించింది. సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం కొత్తగా వచ్చే మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీచేసింది. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసే చర్య అని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఎవరితో సంప్రదించకుండా నియంతృత్వంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించాయి. ప్రభుత్వ ఆదేశాల తర్వాత స్వచ్ఛందంగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారి సంఖ్య పదింతలు పెరిగిందని, తమ లక్ష్యం కూడా ఇదేనని కేంద్రం తాజా ప్రకటనలో పేర్కొన్నది. సంచార్ సాథీ యాప్ యూజర్లు వేగంగా పెరుగుతున్నారని, తప్పనిసరి చేయడం వెనుక ఉద్దేశం కూడా ఇదేనని తెలిపింది. యాప్ తప్పనిసరి అని ఆదేశాలు ఇవ్వడం ద్వారా దీని గురించి తెలియని వాళ్లకు అవగాహన కల్పించాలి భావించామని వెల్లడించారు. గడిచిన ఒక్కరోజులో ఆరు లక్షల మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారని, ఇది దాదాపు పదింతల పెరుగుదల అని కేంద్రం తెలిపింది. సంచార్ సాథీకి ఆదరణ పెరిగిన నేపథ్యంలో ముందస్తు ఇన్‌స్టలేషన్‌ను తప్పనిసరి చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించిందని టెలికామ్ విభాగం తన ప్రకటనలో పేర్కొన్నది.

## వలసలపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే ఆ దేశాలే నష్టపోతాయి



పశ్చిమ దేశాలలోని వలస వ్యతిరేక విధానాలపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా, ఐరోపా దేశాల్లో వలసలపై ఆంక్షలను తప్పుబట్టారు. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే ఆయా దేశాల సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందని, వారే నష్టపోతారని హెచ్చరించారు. చాలా సందర్భాల్లో వారే ఈ సమస్యను సృష్టించారని, కాబట్టి స్వయంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతిభా ప్రవాహానికి అడ్డంకులు ఏర్పరచడం సరికాదని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలకు, ఆయా దేశాల్లోని సంక్షోభానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. వలసలకు సంబంధించి అమెరికా, ఐరోపా దేశాల్లో ఏమైనా ఆందోళనలు ఉంటే అవి ఆ దేశాలు అమలు చేసిన దీర్ఘకాలిక విధానాల ఫలితమే అన్నారు. గత రెండు దశాబ్దాలలో ఉద్దేశపూర్వకంగా, అన్నీ తెలిసే తమ వ్యాపారాలను వ్యూహాత్మకంగా విదేశాలకు విస్తరించాయని ఆయన పేర్కొన్నారు. కాబట్టి ఈ సమస్యకు స్వయంగా వారే పరిష్కార మార్గాలు చూపించాలని అన్నారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల ప్రవాహం ఇరు దేశాలకు ప్రయోజనమని వారు గుర్తించాలని ఆయన అన్నారు. ప్రపంచం ఆధునాతన తయారీ రంగం వైపు మళ్లుతున్న కొద్దీ, నైపుణ్యం కలిగిన ప్రతిభ అవసరం పెరుగుతుందని అన్నారు. ఏ దేశం కూడా స్వయంగా సరిపడా సంఖ్యలో నిపుణులను వేగంగా తయారు చేయలేదని అన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..



ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బుధవారం ఉదయం బస్తర్ డివిజన్ లోని అటవీ ప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. అక్కడ మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఘటనాస్థలి వద్ద భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.

## కోటి రూపాయల నంబర్ ప్లేట్ కథ కంచికి




హర్యానాలో ఓ ఫ్యాన్సీ నంబర్ ప్లేట్‌ను రికార్డు స్థాయిలో రూ.1.17 కోట్లకు వేలంలో గెలుచుకుని, ఆ తర్వాత డబ్బు చెల్లించడంలో విఫలమైన వ్యక్తిపై అక్కడి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బిడ్డర్ ఆస్తులు, ఆదాయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని రవాణా శాఖను ఆదేశించినట్లు మంత్రి అనిల్ విజ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... నవంబర్ 26న ‘%ఎ=88దీ%8888’ అనే నంబర్ ప్లేట్‌కు ఆన్‌లైన్‌లో వేలం జరిగింది. రూ.50,000 కనీస ధరతో ప్రారంభమైన ఈ వేలంలో రోములస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అయిన సుధీర్ కుమార్ అత్యధికంగా రూ.1.17 కోట్లకు బిడ్ దాఖలు చేసి దక్కించుకున్నారు. అయితే, ఈ నెల 1వ తేదీతో డబ్బు చెల్లించేందుకు గడువు ముగిసినా ఆయన స్పందించలేదు. కేవలం రూ.11,000 సెక్యూరిటీ డిపాజిట్‌ను వదులుకున్నారు. ఈ వ్యవహారంపై హర్యానా రవాణా శాఖ మంత్రి అనిల్ విజ్ తీవ్రంగా స్పందించారు. “వేలంలో పాల్గొనడం ఓ హాబీ కాదు, అదొక బాధ్యత. ఆర్థిక స్థోమత లేకుండా వేలంలో ధరలను పెంచే వారిని నిరోధించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నాం. సుధీర్ కుమార్ ఆస్తులపై విచారణ జరిపి, అవసరమైతే ఆదాయపు పన్ను శాఖకు కూడా లేఖ రాస్తాం” అని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు సుధీర్ కుమార్ స్పందిస్తూ.. సాంకేతిక సమస్యల వల్ల డబ్బు జమ చేయలేకపోయానని తెలిపారు. ఒక నంబర్ ప్లేట్ కోసం ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయడానికి తన కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని, వారితో చర్చిస్తున్నట్లు చెప్పారు. అధికారులు మాత్రం ఈ నంబర్ ప్లేట్‌ను మళ్లీ వేలానికి ఉంచనున్నట్లు ప్రకటించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137